ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
తూర్పుగోదావరి
జిల్లా వార్తలు
బుధవారం 24 జూలై 2024 | 5






రైలు కూత వినపడలే!

- ఉమ్మడి జిల్లాలో పలు రైల్వే ప్రాజెక్టులు పెండింగ్
- ఏపీకి నిధులు ఇస్తామని నిర్మలమ్మ ప్రకటన
- జిల్లాల వారీగా కేటాయింపుల్లేవ్
- ఆశగా ఎదురుచూస్తున్న ప్రజానీకం
- ప్రాజెక్టులు వస్తాయంటున్న పురందేశ్వరి

(రాజమహేంద్రవరం/అమలాపురం/కాకినాడ-ఆంధ్రజ్యోతి)

కేంద్ర బడ్జెట్‌లో 'తూర్పు' రైలు కూత మోత మోగిందా? లేదా? అని గోదారోళ్లలో సంశయం పరుగులు పెడుతోంది. కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ మంగళవారం పార్లమెంట్‌కి సమర్పించిన బడ్జెట్‌లో ఏనాటి నుంచో కొట్టుమిట్టాడుతున్న రైల్వే ప్రాజెక్టుల ఊసే లేకపోవడంపై భిన్నవాదనలు వినిపిస్తున్నాయి. అయితే ఏపీలో రైల్వే ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డవలెప్‌మెంట్ ప్రాజెక్టులకు కేంద్ర ప్రభుత్వం అధిక నిధులు కేటాయిస్తుందని కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ చేసిన ప్రకటనతో ఆశలు చిగురిస్తున్నాయి. అన్నింటినీ కేంద్ర రైల్వే మంత్రికి విన్నవించామని.. దాదాపుగా అన్నీ సాకారమైనట్లేనని రాజమహేంద్రవరం ఎంపీ పురందేశ్వరి చెబుతున్నారు. ఇదిలా ఉండగా స్పష్టమైన ఆదేశాలకు ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా ప్రజలు ఎదురు చూస్తున్నారు. కొవ్వూరు-భద్రాచలం రోడ్ రైల్వే లైను ఎప్పటి నుంచో పెండింగ్‌లో ఉంది.నిడదవోలు జంక్షను అభివృద్ధిపై ఇంకా ఏ కబురూ లేదు. కోటిపల్లికి రైలు సదుపాయం ఎప్పటికో తెలియడం లేదు. రోడ్ కం రైలు బ్రిడ్జిపై రైళ్ల ట్రాఫిక్ పెరగడంతో ఆ వైబ్రేషన్స్‌కి రోడ్డు తరచుగా మరమ్మతులకు గురవుతోంది. దీంతో రైళ్లకు మూడో బ్రిడ్జి అవస రం ఏర్పడింది. రాజమండ్రిలో ఆర్చ్ బ్రిడ్జిపై మరో వంతెనను రూ.100కోట్లతో నిర్మిస్తామని చెప్పి ఏళ్లు గడుస్తున్నా అడుగు ముందడుగు పడలేదు. ఆర్చ్ బ్రిడ్జి నిర్మించినపుడే మరో వంతెన నిర్మాణానికి అనువుగా స్పాన్ల(స్తంభాలు) ను నిర్మించారు. అందువల్ల ట్రాక్ వేస్తే సరిపోతుంది.కానీ మూడో వంతెన దిశగా ఎలాంటి చర్యలూ లేవు. కొన్ని నెలల కిందట ప్రవేశపెట్టిన రైల్వే మధ్యంతర బడ్జెట్‌లో కోటిపల్లి-నర్సాపురం రైల్వే లైనుకు రూ.300 కోట్లను కేంద్రం కేటాయించింది. ఈసారి బడ్జెట్‌లో ప్రాజెక్టుకు నిధుల కేటాయింపుపై స్పష్టత లేదు. గౌతమి, వశిష్ట, వైనతేయ నదులపై నిర్మాణంలో ఉన్న రైల్వే వంతెనల పనులు ఎక్కడికక్కడే అసంపూర్తిగా నిలిచిపోయాయి. కేంద్రం ప్రకటించిన బడ్జెట్‌లో కాకినాడ-పిఠాపురం రైల్వేలైను నిర్మాణానికి కేటాయిం పులపై ఇంకా స్పష్టతరాలేదు. కాకినాడ నగరాన్ని విశాఖ-విజయవాడ మెయిన్ రైల్వేలైన్ లోకి తీసుకువచ్చేందుకు గాను పిఠాపురం రైల్వేస్టేషన్ సమీపం నుంచి ప్రత్యేకంగా 21.5 కిలోమీటర్లు ఉండే రైలు మార్గాన్ని నిర్మించి కాకినాడను కలుపుకుంటూ సామర్లకోట రైల్వేలైను మార్గంలో కలపాలన్న ప్రతిపాదన ఉంది. దీనికి నిధుల కేటాయింపునకు కూటమి నేతలు, కాకినాడ ఎంపీ గట్టి ప్రయత్నాలే చేస్తున్నట్టు సమాచారం.దీనిపై కూడా స్పష్టమైన ప్రకటన లేదు. అమృత్ భారత్ పథకంలో రాజమండ్రి రైల్వే స్టేషను అభివృ ద్ధికి రూ.270 కోట్లు కేటాయించారు. రాజమండ్రిలో గోదావరి రైల్వే స్టేషను ప్రయాణికులకు అనుకూలంగా ఉంటుంది. ఇక్కడ ఒకటి, రెండు మినహా ఎక్స్‌ప్రెస్ రైళ్లు ఆగవు. అన్ని రైళ్లను నిలపాలని ప్రయాణికులు చాలా ఏళ్లగా కోరుతున్నారు. రాజమండ్రి రైల్వే స్టేషన్ గుండా రోజుకు సరాసరిన 30,336 మంది రాకపోకలు సాగిస్తున్నారు. రైలు ప్రయాణికులకు మాత్రం తిప్పలు తప్పడం లేదు.రాజమండ్రి నుంచి విశాఖ, విజయవాడ ఇంటర్‌సిటీ ఎక్స్‌ప్రెస్ లు నడపితే చాలామటుకు తిప్పలు తప్పుతాయి. నిడదవోలు-కాల్దరి మధ్యలో 9.75 కి.మీ మేర రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మాణానికి గెజిట్ నోటిఫికేషన్ విడుదలైంది. అంచనా వ్యయం.. పనులు ఎప్పుడు ప్రారంభమవుతాయనేది తెలియాల్సి ఉంది. ఉమ్మడి జిల్లాలో రైల్వే బడ్జెట్‌పై ఆశలు ఉన్నా.. ఎటూ తేలకపోవడంతో మీమాంస నెలకొంది. నిధుల విడుదలలో ఏపీకి ఏ లోటూ చేయమని నిర్మలమ్మ ప్రకటించడంతో ఆశలు రేకెత్తిస్తున్నాయి.

'పోల' వరమే 6



బడ్జెట్.. బాగు..బాగు



- మోదీ సర్కారు వరాల జల్లు
- కేంద్ర బడ్జెట్‌లో స్వల్ప తాయిలాలు
- కొత్త ఆదాయపు పన్ను శ్లాబుల సవరణ
- 32 వేల మంది ఉద్యోగులకు ఊరట
- విశాఖ-చెన్నై పారిశ్రామిక కారిడార్
- 5,544 కోట్లతో రెండు దశల్లో అభివృద్ధి
- కాకినాడ నోడ్‌కు బంగారు భవిష్యత్తు
- 2,145 మిలియన్ డాలర్ల పెట్టుబడికి ఛాన్స్
- ఉమ్మడి జిల్లాలో పదివేల ఎకరాల సేకరణ
- పారిశ్రామిక క్లస్టర్లకు అడుగులు
- కాకినాడ, రాజమండ్రి మధ్య అనుసంధానం
- ముద్ర రుణం రూ.20 లక్షలకు పెంపు
- ఫీడ్‌పై కస్టమ్స్ డ్యూటీ 5శాతం తగ్గింపు
- ఉమ్మడి జిల్లాలో ఆక్వాకు ఊపు

ఆశల పద్దు..అందరికీ అందేటట్టు

(కాకినాడ, ఆంధ్రజ్యోతి)

నిర్మలమ్మ పద్దు ఈసారి కరుణించింది. పేద, మధ్య తరగతి, ఉద్యోగ వర్గాలను ఊరించి.. ఊరించి నిరాశపర చడమే పనిగా కొన్నేళ్ల పాటు సాగిన బడ్జెట్ ఈసారి నిర్మలంగా మారింది. అన్ని వర్గాలకు ఎంతోకొంత ఉపశమనం కలిగించింది. ప్రతిసారీ రకరకాల వాతలు, వాయింపులతో జేబులు గుల్ల చేసిన బడ్జెట్ ఈసారి సామాన్యులు, ఉద్యోగుల జేబుల్లోంచి కాసులను ఎంతో కొంత మిగిల్చే నిర్ణయాలతో ఊరటనిచ్చింది. ఉద్యోగులు,పెన్షనర్లను పన్ను పోటు నుంచి కొంతవరకు తప్పించింది. విశాఖ-చెన్నై పారిశ్రామిక కారిడార్‌కు ప్రత్యేక సాయం అందిస్తామని ప్రకటించడంతో కాకినాడ నోడ్ బంగారు భవిష్యత్తుకు బాటలు వేసినట్లయింది. ఇది పరుగులు పెడితే ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో పారిశ్రామిక, ఆటోమొబైల్, టెక్స్‌టైల్, పెట్రోకెమికల్, పోర్టుల రూపురేఖలు మారడంతో పాటు పారిశ్రామిక పెట్టుబడులు పరుగులు తీయనున్నాయి. కాకినాడ-రాజమహేంద్రవరం నగరాల రూపురేఖలు మారడంతో పాటు పది వేల ఎకరాల్లో పారిశ్రామిక క్లస్టర్లు అభివృద్ధి చెందనున్నాయి.ఔత్సాహిక వ్యాపారులకు ముద్ర రుణాల పెంపుతో కేంద్ర బడ్జెట్ కొత్తబాటలు పరిచింది. రొయ్యలు, చేపల ఫీడ్‌పై కస్టమ్స్ డ్యూటీ 5 శాతం తగ్గింపుతో ఉమ్మడి జిల్లాలో సంక్షోభంలో ఉన్న ఆక్వారంగానికి కొంత తెరిపినిచ్చినట్లయింది. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో ఉద్యోగ, పెన్షనర్ వర్గాల్లో ఊరట నింపింది. ఉమ్మడి జిల్లాలో సచివాలయ ఉద్యోగులతో కలిపి 32వేల మంది వరకు ప్రభుత్వ ఉద్యోగులు ఉన్నారు. పెన్షనర్లు 45వేల మంది వరకు ఉన్నారు. వీరందరికీ తాజా బడ్జెట్‌తో కొంత మేలు జరగనుంది. కొత్తపన్ను విధానంలో కొన్ని మార్పులు చేయడం వీరికి కలిసిరానుంది. ఎప్పటిలాగే కొత్త పన్ను విధానంలో రూ.3లక్షల వరకు పన్ను లేదు. గతంలో రూ.3లక్షల నుంచి రూ.6లక్షల శ్లాబులో వార్షికా దాయం ఉన్న వారికి ఐదు శాతం పన్ను ఉండేది.కానీ ఇప్పుడు ఆ పరిమితిని రూ.7 లక్షలకు పెంచారు. వెరసి కేంద్ర బడ్జెట్ మెప్పించి అన్ని వర్గాలను మురిపించింది.

కాకినాడ నోడ్ కారిడార్‌తో వెలుగులే..

విశాఖ-చెన్నై పారిశ్రామిక కారిడార్‌కు ప్రత్యేక సాయం చేస్తామని బడ్జెట్‌లో కేంద్రం ప్రకటించడంతో కాకినాడ నోడ్ దశ తిరగనుంది. 800 కిలోమీటర్ల మేర విశాఖ నుంచి చెన్నై వరకు ప్రతిపాదించిన పారిశ్రామిక కారిడార్‌లో ఆంధ్రప్రదేశ్ పరిధిలో నాలుగు నోడ్‌లు ఉండగా, అందులో కాకినాడ నోడ్ ఒకటి. మొత్తం కారిడార్ కింద ఎక్కడికక్కడ ఆయా నోడ్‌ల్లో పోర్టులు, ఎయిర్‌పోర్టులు, హైవేలు, బీచ్‌లు, పారిశ్రామిక క్లస్టర్లను అనుసంధానం చేసి పారిశ్రామిక ప్రగతి భారీస్థాయిలో ఉండేలా ఈ కారిడార్‌ను ప్రతిపాదించారు. మొత్తం విశాఖ-చెన్నై పారిశ్రామిక కారిడార్‌ను రూ.5,544 కోట్లతో రెండు దశల్లో అభివృద్ధి చేయనున్నారు. ప్రస్తుతం తొలిదశ కింద రూ.2,278 కోట్లతో పనులు జరుగుతున్నాయి. రెండో దశలో రూ.2,599 కోట్లతో పనులకు ప్రణాళికలు రూపొందించారు.ఈ నేపథ్యంలో కాకినాడ నోడ్ కింద ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో 10వేల ఎకరాల్లో హార్డ్‌వేర్ తయారీ, టెక్స్‌టైల్, ఫుడ్ ప్రాసెసింగ్, ఆటోమొబైల్స్, ఫార్మా, మెడికల్ పరికరాలు, ఎలక్ట్రానిక్స్, ఏరోస్పేస్ తదితర రంగాలను ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో వివిధ క్లస్టర్ల కింద అభివృద్ధి చేస్తారు. కాకినాడలోని పోర్టులను రాజమహేంద్రవరం విమానాశ్రయానికి అనుసంధానిస్తారు. ఈ రెండు నగరాల మధ్య రోడ్డు, రైలు కనెక్టివిటీని పెంచుతారు. రాజమహేంద్రవరం విమానాశ్రయంలో కార్గో సేవలను అందుబాటులోకి తెస్తారు. గోదావరి, దాని పరిధిలోని కాలువలు, పీసీపీఐఆర్ ఎక్స్‌ప్రెస్ హైవేల నుంచి పరిశ్రమలకు అనుసంధానిస్తారు. కాకినాడ నోడ్ కింద ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో 2045కి 2,145 మిలియన్ డాలర్ల పెట్టుబడులు ఆశిస్తున్నారు. ప్రధానంగా కాకినాడ కారిడార్ కింద ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో పెట్రో క్రెమికల్, ఫార్మా రంగాలను భారీగా అభివృద్ధి చేస్తారు. ఉమ్మడి జిల్లాలో కాకినాడ నోడ్ కింద మామిడి జెల్లి క్లస్టర్లు 750 ఉన్నాయి. రైసుమిల్లులు, బ్రాన్ ఆయిల్ యూనిట్లు 550 ఉన్నాయి. వీటి వార్షిక టర్నోవర్ రూ.800 కోట్లు. వీటిని కూడా నోడ్ కింద క్లస్టర్ల తరహాలో అభివృద్ధి చేయనున్నారు.

ఔత్సాహికులకు ఆమోదముద్ర

వ్యాపార రంగంలో ఔత్సాహికులను ప్రోత్సహించేందుకు గతంలో కేంద్రం ప్రవేశపెట్టిన ముద్ర రుణాలను ఈ బడ్జెట్‌లో మరింత పెంచారు. రూ.10 లక్షల పెట్టుబడి రుణాన్ని రూ.20లక్షలకు పెంచారు. ఈ నేపథ్యంలో ఉమ్మడి జిల్లాలో వేలాది మంది యువతకు మేలు చేకూర నుంది. ఇకపై ఇంట్లో మైనర్ పిల్లల పేరు తోను తల్లిదండ్రులు పెట్టుబడులు పెట్టేలా కేంద్రం కొత్తగా బడ్జెట్‌లో ఎన్‌పీఎస్ వాత్సల్య పథకం ప్రవేశపెట్టింది. తద్వారా లక్షల కుటుంబాలకు ప్రయోజనం చేకూరనుంది. దేశీయ విద్యా సంస్థల్లో ఉన్నత విద్య అభ్యసించేందుకు రూ.10 లక్షల వరకు విద్యా రుణాలను కేంద్రం ప్రకటించింది. పట్టణాల్లో నివసించే ప్రజల సొంతింటి కలను నెరవేర్చేలా బడ్జెట్‌లో కేంద్రం పెద్దపీట వేసింది. ప్రధాని ఆవాస్ యోజన పథకానికి ఐదేళ్ల పాటు రూ.2.2 లక్షల కోట్ల సాయం ప్రతిపాదన చేయడంతో పాటు కోటి మంది గృహ అవసరాలు తీర్చేలా ఆర్థిక సాయం, వడ్డీ రాయితీ ప్రకటించింది. ఈ నేపథ్యంలో ఉమ్మడి జిల్లాలో కాకినాడ, రాజమహేంద్రవరం నగరాలకు వలస వచ్చి స్థిర నివాసం లేని వేలాది మందికి ప్రయోజనం చేకూరనుంది.

కంపెనీలకు పండగే...

పారిశ్రామిక రంగానికి ఊతమిచ్చేలా దేశీయ తయారీని ప్రోత్సహించేందుకు కేంద్రం అనేక కీలక నిర్ణయాలను బడ్జెట్‌లో ప్రకటించింది. అందులో భాగంగా కస్టమ్స్ డ్యూటీపై భారీ కోతలు విధించింది. దీనివల్ల ఎలక్ట్రానిక్, విలువైన లోహాలు, ఔషధాల ధరలు తగ్గనున్నాయి. ఉమ్మడి జిల్లాలో కాకినాడ, రాజమహేంద్రవరం, చుట్టుపక్కల అనేక ప్రాంతాల్లో నడుస్తున్న పలు ఫార్మా, ఇతర తయారీ యూనిట్లకు ఉత్పాదక వ్యయం తగ్గనుంది. ఆయా కంపెనీలకు ఆర్థిక భారం తగ్గనుంది. బంగారంపై బేసిక్ కస్టమ్ డ్యూటీని బడ్జెట్‌లో తగ్గించారు. పుత్తడి, వెండి వస్తువులపై కస్టమ్స్ డ్యూటీని ఆరు శాతానికి తగ్గించారు. గతంలో బంగారంపై చెల్లించే పన్ను 11 శాతం, అగ్రి సెస్‌తో కలిసి మొత్తం 15 శాతం ఉండేది. తాజా సవరణతో మొత్తం బంగారంపై పన్ను 11 శాతమే ఉండనుంది. దీని ప్రభావంతో మంగళవారం గ్రాము బంగారంపై ధర రూ.250కిపైగా పడింది. ఈ నేపథ్యంలో కొనుగోళ్లు ఊపందుకోనున్నాయి. తద్వారా రాష్ట్ర ప్రభుత్వానికి జీఎస్టీ వసూళ్లు కోట్లలో పెరగనున్నాయి. క్యాన్సర్ రోగులకు ఊరటనిచ్చేలా మరో మూడు కీలక ఔషధాలపై కస్టమ్స్ డ్యూటీ పూర్తిగా తొలగించారు. దీంతో జిల్లాలో వందలాది మంది క్యాన్సర్ రోగులకు ఆర్థిక భారం తొలగనుంది. మహిళల పేరిట కొనుగోలు చేసే ఆస్తులపై సుంకాన్ని మరింత తగ్గించేలా దృష్టిపెడతామని ఆర్థిక మంత్రి ప్రకటించడంతో అతివలకు కీలక ప్రాధాన్యం ఇచ్చినట్లయింది. స్థిరాస్తులపై ఏవిధంగా దీనికి సంబంధించిన విధివిధానాలు ఉంటాయనేదానిపై స్పష్టత రావాల్సి ఉంది.

ఆక్వాకు ఊపే..

ఉమ్మడి తూ.గో. జిల్లాలో కాకినాడ, కోనసీమ జిల్లాల్లో ఆక్వా రంగం భారీగా విస్తరించి ఉంది. 58వేల ఎకరాల్లో 23వేలకుపైగా హేచరీలు నడుస్తున్నాయి. అటు వేలాది ఎకరాల్లో చేపల చెరువులు ఉన్నాయి. గడచిన మూడేళ్లలో ఫీడ్ ధరలు ఆకాశాన్నంటాయి. దీంతో పెట్టుబడి వ్యయం తీవ్రంగా పెరిగిపోయింది. ఏటా ఉమ్మడి తూ.గో.జిల్లా నుంచి కోట్లలో ఒక్క రొయ్యల ఫీడ్ కోసమే ఆక్వా రైతులు ఖర్చు చేస్తున్నారు. అదే సమయంలో అంతర్జాతీయ మార్కెట్‌లో ధరలు పడిపోవడంతో ఎగుమతులు నిలిచిపోయాయి. దీంతో ఈ రంగం ప్రస్తుతం సంక్షోభంలో ఉంది. ఈ తరుణంలో కేంద్ర బడ్జెట్ ఆక్వా రంగానికి భారీ ఉపశమనం కలిగించింది. రొయ్యలు, చేపల ఫీడ్‌పై కస్టమ్స్ డ్యూటీ ఐదు శాతం తగ్గించింది. దీంతో రొయ్యలు, చేపల ఫీడ్ ధరలు భారీగా తగ్గనున్నాయి. ఈ నేపథ్యంలో తిరిగి ఈ రంగం కొంత కోలుకునే అవకాశం ఏర్పడింది.



ఏపీ అభివృద్ధి బడ్జెట్ ఇది..



ఏపీ అభివృద్ధి బడ్జెట్ ఇది. ప్రాజెక్టులకు, కారిడార్‌లకు నిధులు కేటాయించారు. ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రకటించిన బడ్జెట్ అన్ని వర్గాలకు అండగా ఉంది. కేంద్రం కొవిడ్ కాలంలో కొవ్వూరు రైల్వేస్టేషన్‌లో రద్దయిన రైళ్లను వీలైనంత త్వరగా పునరుద్ధరించాలని కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్‌ను కోరాను.

- దగ్గుబాటి పురందేశ్వరి, రాజమహేంద్రవరం ఎంపీ

రాజధానికి 15 వేల కోట్లు



అమరావతి రాజధాని నిర్మాణానికి రూ.15 వేల కోట్లను అదనంగా బడ్జెట్‌లో కేటాయించడం రాష్ట్ర ప్రగతికి శుభపరిణామం. రాజధానితో పాటు పోలవరం ప్రాజెక్టు నిర్మాణానికి నిధుల కేటాయింపుపై కేంద్రం భరోసా ఇవ్వడంతో అడ్డంకులు తొలగాయి. రాష్ట్రంలో మరిన్ని ప్రాజెక్టులకు, కారిడార్‌లకు నిధులు కేటాయించారు.

- గంటి హరీష్‌మాధుర్, అమలాపురం ఎంపీ

ఆశాజనకంగా ఉంది



కేంద్ర బడ్జెట్ ఆశాజనకం. పోలవరం ప్రా జెక్టును త్వరితగతిన పూర్తి చేసేందుకు హామీ ఇవ్వడం, వెనుకబడిన రాయల సీమ, ప్రకాశం, ఉత్తరాంధ్ర జిల్లాల అభివృద్ధికి ప్రత్యేక ప్యాకేజీ ప్రకటించడం హర్షణీయం. పూర్వోదయ పథకం ద్వారా ఏపీకి కొత్త ప్రాజెక్టులు ప్రకటించడం ద్వారా పారిశ్రామిక అభివృద్ధికి ఆస్కారం ఏర్పడుతుంది.

- తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్, కాకినాడ ఎంపీ

ఉరుకులు.. పరుగులు : ధవళేశ్వరం వద్ద గోదావరి ఉధృతి

ఉప్పొంగినది!



రాజమహేంద్రవరం, జూలై 23 (ఆంధ్రజ్యోతి)/కొవ్వూరు :అఖండ గోదావరి మహోగ్రరూపం దాల్చింది. ఎగువన భద్రాచలం, దిగువన ధవళేశ్వరం బ్యారేజ్‌ల వద్ద రెండు ప్రమాద హెచ్చరికలు జారీ చేయడంతో తీర ప్రాంత ప్రజలకు కంటి మీద కునుకు లేకుండా పోయింది.భద్రాచలం వద్ద గోదావరి వరద తగ్గుముఖం పట్టడంతో ధవళేశ్వరం బ్యారేజీ వద్ద వరద ప్రవాహం పెరుగుతోంది. బ్యారేజీ వద్ద మంగళవారం తెల్లవారుజామున 2 గంటలకు రెండో ప్రమాద హెచ్చరిక జారీ చేశారు. రాత్రి 11 గంటలకు బ్యారేజీ నీటి మట్టం 14.80 అడుగులకు చేరింది. పాండ్ లెవల్ 15.18 మీటర్లుగా ఉంది. బ్యారేజి నుంచి సముద్రంలోకి 14,36,472 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. భద్రాచలం వద్ద 49.90 అడుగులకు నీటిమట్టం తగ్గింది..

- ధవళేశ్వరం వద్ద రెండో ప్రమాద హెచ్చరిక
- 14,36,472 క్యూసెక్కులు విడుదల
- 18.80 అడుగులకు నీటిమట్టం
- నీట మునుగుతున్న లంకలు
- పునరావాస కేంద్రాలకు తరలింపు
- భద్రాచలం వద్ద తగ్గుముఖం
- నీట మునిగిన కొవ్వూరు గోష్పాదక్షేత్రం





కడియపులంకలో నీట మునిగిన మొక్కలు

భద్రాచలం నుంచి ధవళేశ్వరం బ్యారేజ్‌కు వరద ప్రవాహం చేరుకోవడానికి సుమారు 18 గంటలు సమయం పడుతుందని గోదావరి హెడ్‌వాటర్ వర్క్సు అధికారుల అంచనా వేస్తున్నారు. ఈ నేపథ్యంలో బ్యారేజీ వద్ద రెండో ప్రమాద హెచ్చరిక బుధవారం కూడా కొనసాగుతోంది. ఇప్పటికే రాజమహేంద్రవరం, కొవ్వూరు డివిజన్ల మధ్య అఖండ గోదావరి సముద్రంలా మారింది. కొవ్వూరు గోష్పాదక్షేత్రం నీట మునిగింది. ఆలయాలన్నీ నీట మునిగాయి. క్షేత్రంలోకి ఎవ్వరూ రాకుండా కొవ్వూరు డీఎస్పీ కె. శ్రీనివాసమూర్తి ఆధ్వర్యంలో పట్టణ సీఐ వి.జగదీశ్వరరావు పోలీసు పికెటింగ్ ఏర్పాటుచేశారు. గోదావరి వరద ప్రభావంతో రాజమహేంద్రవరం పరిధి లోని లంకలన్నీ మునిగిపోతున్నాయి. ఇప్పటికే బ్రిడ్జిలంక, కేతావారిలంక, ఎదుర్లమ్మలంక వంటివి మునిగిపోవడంతో 248 మందిని రాజమహేంద్రవరంలోని పునరావాస కేంద్రాలకు తరలించారు. ఆల్‌కట్ గార్డెన్స్‌లోని మునిసిపల్ కల్యాణ మండపంలో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాన్ని మంగళవారం కలెక్టర్ పరిశీలించి సదుపాయాలపై ఆరా తీశారు.

రేవుల్లో దిగితే కేసులే..

రాజమహేంద్రవరం సిటీ, జూలై 23: గోదావరి ఉధృతంగా ఉన్నందున రాజమహేంద్రవరంలో అన్ని స్నానాల రేవులను నగరపాలక సంస్థ అధికారులు మూసివేశారు. కోటిలింగాలరేవు. చింతాలమ్మఘాట్, పుష్కరాలరేవు, టీటీడీ ఘాట్, శ్రద్ధానందాఘాట్, లాంచీల రేవు, గౌతమి ఘాట్, సరస్వతి ఘాట్‌లను మూసివేశారు. అక్కడ రేవులలో గోదావరిని చూసేందుకు వీలులేకుండా గేట్లను మూసివేసి సిబ్బందిని ఏర్పాటు చేశారు. పలు ఘాట్ల వద్ద కర్రలతో లోపలకు ఎవరూ వెళ్లకుండా ఏర్పాట్లు చేశారు.ఎవరైనా రేవుల్లో దిగితే కేసులు పెడతామని హెచ్చరిస్తున్నారు.

వరదలోనే ఉంటాం..

సీతానగరం మండలంలోని ముల్లకలంక నుంచి ప్రజలు బయటకు రావడంలేదు. సుమారు 1000 మంది వరకూ జనం ఉన్నారు. 320 ఇళ్లు ఉన్నాయి. 850 వరకూ గేదెలు, ఆవులు ఉన్నాయి.ఇక్కడ పాల వ్యాపారులే ఎక్కువ. వారెవరూ బయటకు రావడంలేదు. జనం వచ్చితమ పనులు చూసుకుని తిరిగి లంకల్లోకి వెళ్లేందుకు గోదావరిలో రెండు పడవలు ఏర్పాటు చేశారు.ఆర్ఐ లక్ష్మీదేవి ఆధ్వర్యంలో క్యాంపు ఏర్పాటు చేశారు.కొవ్వూరు రూరల్ మద్దూరు లంక నుంచి వరద బాధితులు పునరావాస కేంద్రాలకు రావడం లేదు. అధికారులు తరలించేందుకు ప్రయత్నిస్తున్నారు. ఎర్రకాలువ వరద కారణంగా నల్ల జర్లనిడదవోలు మండలాల్లో పునరావాస కేంద్రాలు కొనసాగుతున్నాయి. ఎర్రకాల్వ తగ్గుముఖం పట్టడంతో ఖాళీ చేసి వెళ్లిపోయారు.

గోష్పాదక్షేత్రంలో గోదావరి వరద





ఆర్యాపురం అర్బన్ బ్యాంకులో సమావేశమైన నూతన పాలకవర్గం

అర్బన్ బ్యాంక్ చైర్మన్‌గా చల్లా శంకరరావు
వైస్‌చైర్మన్‌గా పోలాకి పరమేశ్వరరావు

రాజమహేంద్రవరం, జూలై23(ఆంధ్రజ్యోతి) : ఆర్యాపురం అర్బన్ బ్యాంక్ పాలకవర్గం మంగళవారం బాధ్యతలు స్వీకరించింది. తెలుగుదేశం-జనసేన-బీజేపీ కూటమికి చెందిన చల్లా శంకరరావు చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించారు.ఆయన చైర్మన్‌గా రెండోసారి ఎన్నికయ్యారు. మొత్తం 12 మంది డైరెక్టర్లు కూటమికి చెందిన వారే కావడంతో వారంతా చల్లాను చైర్మన్‌గా ఎన్నుకున్నారు. పోలాకి పరమేశ్వరరావును వైస్ చైర్మన్‌గా ఎన్నుకున్నారు. డెరెక్టర్లుగా కప్పల సూర్యప్రకాశరావు, పడాల శ్రీనివాసరావు, పిల్లి శ్యామ్ కుమార్, యర్రమోతు ధర్మరాజు, బుడ్డిగ రవి కొండలరావు, యాళ్ల వెంకట్రావు, ముగిది శ్రీనివాసరావు , యెనుమల రంగారావు, సింగంపల్లి రంగారావు,నీలపాల సూర్య సత్యనారాయణ బాధ్యతలు స్వీకరించారు. పాలకవర్గాన్ని మాజీ ఎమ్మెల్సీ ఆదిరెడ్డి అప్పారావు,జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి అనుశ్రీ సత్యనారా యణ అభినందించారు. బ్యాంక్‌ను అభివృద్ధి పథంలో నడిపిస్తామని చైర్మన్ శంకరరావు, పాలకవర్గ సభ్యులు ప్రకటించారు.

బ్యాంకర్లతో కలెక్టర్ సమీక్ష

రాజమహేంద్రవరం రూరల్, జూలై 23: అల్పాదాయ వర్గాలు, స్వయం సహాయక సంఘాలు, ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు, కౌలు రైతులకు రుణాల మంజూరులో బ్యాంకర్లు ఉదారతతో వ్యవహరించాలని కలెక్టర్ పి.ప్రశాంతి అన్నారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో బ్యాంకర్లతో సమీక్షించారు. 2023-24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి 3,4వ త్రైమాసికాల వార్షిక ప్రణాళికల అమలు పురోగతి, ప్రాధాన్యత అంశాలు, అల్పాదాయ వర్గాల ఆర్థిక చేకూర్పు, వ్యవసాయ అనుబంధ రంగాల రుణ ప్రణాళిక ప్రగతి, ఎస్‌హెచ్‌జీ, బ్యాక్ లింకేజీ, వికసిత భారత్, విశ్వకర్మ యోజన, కేంద్ర ప్రభుత్వ పథకాలకు బ్యాంకు రుణాలు తదితర అంశాలపై చర్చించారు. సీసీఆర్సీ కార్డులు పొందిన కౌలు రైతులకు రుణాలు మంజూరు చేయాలన్నారు. బ్యాంకర్లు విడిగా ఆర్థిక అక్షరాస్యత డిజిటల్ లిటరసీ కార్యక్రమాలు నిర్వహిస్తూ నగదు రహిత లావాదేవీలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలు, గృహ ఆధారిత రంగాల్లో నైపుణ్యశిక్షణ కార్యక్రమాలు నిర్వహించాలన్నారు ఎంఎస్ఎంఈ రంగం అభివృద్ధిలో భాగంగా చిన్న, మధ్య తరహా పరిశ్రమల తోడ్పాటుకు బ్యాంకర్లు ఆర్థిక ప్రోత్సాహాన్ని అందించాలన్నారు. ప్రధానమంత్రి స్వనిధి పథకం అమలులో రాష్ట్రంలోనే మొదటి స్థానంలో నిలవడం జరిగిందన్నారు. కేంద్ర ప్రభుత్వం ధ్రువీకరించిన ధ్రువపత్రాన్ని కలెక్టర్ ప్రశాంతి ఎల్‌డీఎం డీవీ ప్రసాద్‌కు అందజేశారు. కార్యక్రమంలో ఎల్‌డీవో నాగ ప్రవీణ్, నాబార్డ్ ఏజీఎం స్వామి నాముడు, బ్యాంకు కన్వీనర్లు తదితరులు పాల్గొన్నారు.

ఊళ్లు..నీళ్లు



పెరవలి మండలం తీపర్రులో



వరదనీటిలో వరరామచంద్రపురం మండలం శ్రీరామగిరి గ్రామం

40 గ్రామాలు జలదిగ్బంధంలో..

వరరామచంద్రాపురం, జూలై 23: గోదావరి వరద ప్రవాహం మంగళవారం మధ్యాహ్నం నుంచి నిలకడగా ఉంది. మండల పరిధిలోని వడ్డిగూడెం కాలనీ పూర్తిగా నీటమునిగింది. మండలంలో దాదాపుగా 40 గ్రామాలు మూడు రోజులుగా జల దిగ్బంధంలో ఉన్నాయి. ఆయా గ్రామాలకు తహశీల్దార్ మౌలానాఫాజిల్ ఇంజన్ బోట్లను ఏర్పాటు చేశారు. వీఆర్‌పురం గోదావరి స్పెషల్ అధికారి ప్రసాద్‌కుమార్, సీఐ రామారావు, తహశీల్దార్, ఎస్‌ఐ నాగరాజు శ్రీరామగిరి, వడ్డిగూడెం, దర్భతాళ్లగూడెం గ్రామాల్లో పర్యటించారు. బాధితులకు బియ్యం, కందిపప్పు పంపిణీ చేశారు. కార్యక్రమంలో జడ్పీటీసీ వాళ్ల రంగారెడ్డి, ఆర్‌ఐ రామకృష్ణ, సర్పంచులు పాల్గొన్నారు

ఉధృతంగా గోదావరి

ధవళేశ్వరం వద్ద రెండో ప్రమాద హెచ్చరిక జారీ

14.60 అడుగులకు చేరుకున్న నీటి మట్టం

14.36 లక్షల క్యూసెక్కులు సముద్రంలోకి..



ధవళేశ్వరం, జూలై 23: ఎగువ ప్రాంతాల నుంచి పోటెత్తుతున్న వరద నీటితో ధవళేశ్వరం వద్ద గోదావరి నీటి మట్టం అంతకంతకు పెరుగుతుండడంతో సోమవారం రాత్రి 2గంటలకు రెండో ప్రమాద హెచ్చరికను జారీ చేశారు. ఆదివారం ఉదయం 7గంటలకు మొదటి ప్రమాద హెచ్చరిక జారీ కాగా 42గంటల వ్యవధిలో నీటి మట్టం 13.75అడుగులకు చేరుకుని 13లక్షల క్యూసెక్కులు నీరు తరలిరావడంతో రెండో ప్రమాద హెచ్చరిక జారీ అయింది. ఆపై నీటి మట్టం పెరుగుదల క్రమంగా నెమ్మదించి 3గంటలకు ఒక పాయింట్ చొప్పున పెరుగుతూ మంగళవారం రాత్రి 11 గంటలకు 14.80అడుగులకు చేరుకుంది. ఈ సమయంలో కాటన్ బ్యారేజ్ నుంచి 14,36,472 క్యూసెక్కులు దిగువకు ప్రవహిస్తోంది. ఎగువన అన్ని ప్రాంతాల్లో నీటి మట్టం తగ్గుముఖం పట్టడంతో శుక్రవారం నాటికి ప్రమాదహెచ్చరికలు ఉపసంహరించే స్థాయికి నీటి మట్టం తగ్గవచ్చని అధికారులు అంచనా వేస్తున్నారు. ఎగువన భద్రాచలం వద్ద మంగళవారం ఉదయం 9గంటలకు 51.60 అడుగుల వరకు పెరిగిన నీటి మట్టం ఆపై తగ్గుతూ రాత్రి 7గంటలు 50.50 అడుగులకు చేరింది.

ఎగువ ప్రాంతాల్లో నీటి మట్టం తగ్గుముఖం

ఎగువన అన్ని ప్రాంతాల్లో గోదావరి నీటి మట్టం తగ్గుముఖం పట్టింది. కాళేశ్వరం వద్ద 12.39 మీటర్ల వరకు పెరిగిన నీటి మట్టం క్రమంగా తగ్గుతూ మంగళవారం సాయంత్రానికి 11.480మీటర్లకు చేరుకుంది. పేరూరు వద్ద 17.300 మీటర్ల నుంచి 16.290 మీటర్లకు, దుమ్ముగూడెం వద్ద 14.070 మీటర్ల నుంచి 13.710మీటర్లకు, భద్రాచలం వద్ద 51.60అడుగుల నుంచి 50.50అడుగులకు నీటి మట్టం తగ్గింది. కూనవరం వద్ద 21.450మీటర్లగా నీటి మట్టం నమోదు కాగా స్వల్పంగా పెరుగుతోంది. కుంట వద్ద 12.700మీటర్ల వరకు పెరిగిన నీటి మట్టం తగ్గుతూ 12.660మీటర్లకు చేరుకుంది. పోలవరం వద్ద 13.450 మీటర్లు, రాజమహేంద్రవరం రైల్వే బ్రిడ్జి వద్ద 16.920మీటర్లుగా నమోదు కాగా నీటి మట్టం పెరుగుతూ ఉంది.

బాహ్య ప్రపంచంతో సంబంధాలు కట్

పెరుగుతున్న శబరి

చింతూరు వద్ద శబరి నీటిమట్టం 41.6 అడుగులు

శబరికి గోదావరి ఎగపోటు

జలమయమైన జాతీయ రహదారులు



నీళ్లల్లో వడ్డిగూడెం గ్రామం

చింతూరు, జూలై 23: చింతూరు వద్ద మంగళవారం సాయంత్రానికి శబరి నీటి మట్టం 41.6 అడుగులకు చేరింది. భద్రాచలంలో 51.6 అడుగులకు చేరిన గోదావరి నీటిమట్టం మంగళవారం సాయంత్రానికి తగ్గుముఖం పట్టి 50.9 అడుగులకు చేరుకుంది. కూనవరం వద్ద గోదావరి వరద శబరి వరదకు పోటునివ్వడంతో ఆ నీరంతా తిరిగి వెనక్కి రావడంతో చింతూరు వద్ద ఉధృతి పెరుగుతోంది. దీంతో పలు రహదారులపై వరద నీరు చేరి రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. దీంతో డివిజన్‌లోని 177 గ్రామాలకు బాహ్య ప్రపంచంతో సంబంధాలు కట్ అయ్యాయి. పలు గ్రామాల్లోని ఇళ్లలోకి వరద నీరు చేరింది. దీంతో ఆయా కుటుంబాలు సురక్షిత ప్రాంతాలకు తరలి వెళుతున్నాయి. చింతూరు మండలం చట్టి వద్ద 30వ నెంబరు జాతీయ రహదారి, కుయుగూరు వద్ద 326వ నెంబరు జాతీయ రహదారులు జలమయమయ్యాయి. దీంతో ఆ దిశగా రాకపోకలు నిలిచి రహదారులపై వాహనాలు బారులు తీరాయి. వరద ప్రభావిత గ్రామాలకు రేషన్, నిత్యావసర సరుకుల పంపిణీ మొదలైంది. ఈ మేరకు రెడ్ క్రాస్ సొసైటీ సేవలందిస్తోంది. కాగా బాధితులు స్వచ్ఛందంగా ఏర్పాటు చేసుకున్న వలస పాకల్లో విద్యుత్ సౌకర్యం కల్పించే అవకాశం లేకపోవడంతో వారంతా చీకట్లో మగ్గాల్సిన పరిస్థితి నెలకొంది. పలు గ్రామాల సమీపంలో వరద నీరు చేరడంతో గ్రామాలకు విద్యుత్ సరఫరా తాత్కాలికంగా నిలిపివేశారు. గ్రామాలను వరద నీరు చుట్టుముట్టడంతో పలువురు నిత్యావసర సరుకుల కోసం నాటు పడవలపై చింతూరు చేరుకుంటున్నారు. వరరామచంద్రపురం మండలంలో నోడల్ అధికారి ప్రశాంత్‌కుమార్ ముంపు ప్రాంతాలలో నేరుగా పర్యటిస్తూ అవసరమైన చర్యలు తీసుకుంటున్నారు. డొంకరాయి రిజర్వాయరు సామర్థ్యం 1037 అడుగులు కాగా మంగళవారం సాయంత్రానికి 1032.90 అడుగులకు చేరుకుంది. చింతూరు ఏఎస్పీ రాహుల్ మీనా విలీన మండలాల ప్రజలు తమ ప్రయాణాలను వాయిదా వేసుకోవాల్సిందిగా ప్రకటించారు. రహదారులపై భారీ స్థాయిలో వరద నీరు చేరడంతో ఆ దిశగా ప్రయాణం చేసే సాహసం ఏ ఒక్కరూ చేయవద్దని ఆయన సూచించారు. అల్లూరి సీతారామరాజు జిల్లా కలెక్టర్ దినేష్‌కుమార్ ఎటపాక మండలంలో పర్యటించి పరిస్థితిని సమీక్షించారు.

వరద కాస్త తగ్గుముఖం



నందిగామపాడు హైస్కూల్‌ను చుట్టుముట్టిన వరద

ఎటపాక, జూలై 23: గత రెండు రోజులుగా పెరుగుతూ వస్తున్న గోదావరి వరద ...మంగళవారం మధ్యాహ్నం నుంచి కాస్త నెమ్మదిగా తగ్గుతుంది. మంగళవారం ఉదయం 51.6 అడుగుల వరకు పెరిగిన నీటిమట్టం మధ్యాహ్నం తర్వాత నిలకడగా ఉంటూ, క్రమంగా తగ్గుతోంది. దీంతో విలీన మండలాల వాసులు కాస్త ఊపిరిపీల్చుకున్నారు. అయితే గత రెండు రోజులుగా భద్రాచలం-కూనవరం ప్రధాన రహదారి జలదిగ్బంధంలోనే ఉంది. ఈ వైపు రాకపోకలు స్తంభించాయి. వీరాయిగూడెం- నెల్లిపాక గ్రామాల మధ్యలో రహదారిపై వరదనీరు చేరడంతో గత మూడు రోజులుగా రాకపోకలు నిలిచాయి. నందిగామ జడ్పీ పాఠశాల ఆవరణను వరదనీరు చుట్టుముట్టింది.

బాధితుల్లో అదే భయం



బోట్ల ద్వారా పునరావాసానికి తరలివెళ్తున్న దృశ్యం

కూనవరం, జూలై 23: కూనవరం మండలం పరిధిలో గోదావరి ఉధృతి కొనసాగుతోంది. వరద బాధితులు పునరావాస కేంద్రాల్లోనే తలదాచుకుంటున్నారు. పూర్తిగా 52 గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. జనజీవనం స్తంభించిపోయింది. నిత్యావసర సరుకుల కొనుగోళ్లు ఆగిపోయాయి. కూరగాయలతో పాటు పాలు కూడా దిగుమతి కాలేదు. కూనవరం, టేకులబోరు, మరికొన్ని గిరిజన గ్రామాల ప్రజలు కోతులగుట్ట పునరావాస కేంద్రంలో తలదాచుకున్నారు. శబరి బెల్టులోని గిరిజన గ్రామాలు గుట్టలెక్కి అక్కడే ఉన్నారు. మరో వైపు యుద్ధ ప్రాతిపదికన ప్రభుత్వం పనులు చేపట్టింది. పునరావాస కేంద్రాలకు ప్రజలు వెళ్లేందుకు బోట్లను ఏర్పాటు చేశారు. ఎప్పటికప్పుడు ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించారు. రెండు నెలలకు సరిపడ బియ్యం పంపిణీ జరిగింది. రాత్రి వేళల్లో నిర్వాసితులను ట్రాక్టర్ల ద్వారా పునరావాస కేంద్రాలకు తరలించారు. నేటి నుంచి ప్రభుత్వం నిత్యావసర సరుకులను పంపిణీ చేయనుంది. ప్రతీ గ్రామానికి ట్రాక్టర్లు, వ్యాన్లు ద్వారా బియ్యం, టార్పాలిన్లు, సరుకులు పంపిణీ చేస్తామని అధికారులు తెలిపారు.

ఇక పోలవరమే



ఏజెన్సీలో నిర్వాసిత గ్రామం ఏర్పాటుకు సేకరించిన స్థలం

రాజమహేంద్రవరం(ఆంధ్రజ్యోతి): పోలవరం నిర్మాణానికి తమ పూర్తి సహకారం ఉంటుందని కేంద్రం ప్రకటించింది. దీంతో ఈ ప్రాజెక్టుకు మళ్లీ జీవం పోసినట్టయింది. 2019కి ముందు అప్పటి సీఎం చంద్రబాబు 72 శాతం మేర ప్రాజెక్టు పనులు పూర్తిచేసిన సంగతి తెలిసిందే. కానీ మొత్తం భూసేకరణ, పునరావాసం, కాలువలు అన్నీ కలుపుకుంటే కేవలం 49.79 శాతం అయినట్టే లెక్క. ఇక 2019లో జరిగిన ఎన్నికల్లో వైసీపీ అధికారంలోకి రావడంతో జగన్ ప్రభుత్వం ఈ ప్రాజెక్టును నిర్లక్ష్యం చేసింది. ఇటీవల జరిగిన ఎన్నికల్లో తెలుగుదేశం-జనసేన-బీజేపీ కూటమి ప్రభుత్వంరావడం, చంద్రబాబు మళ్లీ సీఎం కావడంతో ఈ ప్రాజెక్టుకు మళ్లీ దశ తిరిగింది. గతంలో మారిన అంచనాలను కూడా కేంద్రం అంగీకరించి, ప్రాజెక్టును పూర్తిచేయడానికి సహకరిస్తుందని కూటమి నేతలు చెబుతున్నారు. ప్రాజెక్టును 41.15 మీటర్ల ఎత్తువరకూ మొదటి దశలో నిర్మించడానికి గతంలో కేంద్ర కేబినెట్ ఆమోదించిన సంగతి తెలిసిందే. దాని ప్రకారం 30,436.95 కోట్ల అంచనా వేశారు. అందులో హెడ్‌వర్క్సు పనులకు రూ.14,023.2 కోట్లు, ఎడమ ప్రధాన కాలువ నిర్మాణానికి 1955.23 కోట్లు, కుడి ప్రధాన కాలువ నిర్మాణానికి 1812.45 కోట్లు, భూసేకరణకు 4853.22 కోట్లు ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీకి రూ.7417.19 కోట్లు, పీపీఏ చార్జిల కింద రూ.375.66 కోట్లు అవుతుందని అంచనా వేశారు. ఇది జాతీయ ప్రాజెక్టుగా ప్రకటించకముందే రూ.4730.71 కోట్లు ఖర్చయింది. గత ఏప్రిల్ నాటికి 25,706.24 కోట్లు బ్యాలెన్స్ ఉంది. జాతీయ ప్రాజెక్టుగా ప్రకటించిన తర్వాత 15,146.27 కోట్లు విడుదల చేశారు. ఫేజ్-2 కోసం ఖర్చు చేసింది రూ. 1597.56 కోట్లు. ఇంకా మిగిలింది రూ.12,157.53 కోట్లు. మరోవైపు 2019కి ముందే ఈ ప్రాజెక్టు నిర్మాణ వ్యయ అంచనాను రూ.54 వేల కోట్లకు పెంచి ప్రతిపాదించిన సంగతి తెలిసిందే. అప్పట్లో కేంద్రం కూడా అంగీకరించింది. కానీ వైసీపీ వైఖరి వల్ల దీనిపై కేంద్రం స్పష్టత ఇవ్వలేదు. ఇవాళ మళ్లీ దీనిపై కదలిక వచ్చే అవకాశం ఉంది. ప్రస్తుతం డయాఫ్రంవాల్ దెబ్బతినడం వల్ల దానికి రిపేర్లు చేయాలంటేనే రూ.447.90 కోట్లు అవసరం. ప్రత్యామ్నాయ డయాఫ్రంవాల్ నిర్మించాలంటే రూ.990 కోట్లు అవుతుంది. ప్రత్యామ్నాయ డయాఫ్రంవాల్ వైపే రాష్ట్రం మొగ్గు చూపుతున్నట్టు తెలుస్తోంది.

భూసేకరణ, పునరావాసానికే రూ.26 వేల కోట్లు కావాలి

రంపచోడవరం, జూలై 23: విభజన చట్టంలోని సెక్షన్ 90 ప్రకారం పోలవరం బాధ్యత మొత్తం కేంద్రంపైనే ఉంది. అయితే ఇంతకాలం దోబూచులాడుతూ వచ్చిన కేంద్రం, ఎట్టకేలకు ఆంధ్రుల జీవనాడిగా పేరొందిన పోలవరం ప్రాజెక్టును పూర్తి చేయడం తమ బాధ్యతగానే చెప్పుకొచ్చింది. ఈ ప్రాజెక్టు మొత్తం పూర్తికావడానికి ఒక్క భూసేకరణ-పునరావాసం కోసమే రూ.33,470 కోట్లు అవసరమని అంచనా వేయగా, ఇప్పటికీ భూసేకరణ-పునరావాసాల కోసం ఇంకా రూ.25,917 కోట్లు అవసరం. పోలవరాన్ని పూర్తి స్థాయిలో పూర్తిచేయాలంటే భూసేకరణలో ఇంకా 54,640 ఎకరాల భూమిని సేకరించాల్సి ఉంది. ఇంకా 83,863 మంది నిర్వాసితులను తరలించాల్సి ఉంది. ఇందులో భూసేకరణ కోసం రూ.6,577 కోట్లు, పునరావాసం కోసం రూ.19,340 కోట్లు అవసరమవుతున్నాయి. ఈ ప్రక్రియ పూర్తి కాకుండా నిర్వాసితులను వారి గ్రామాల నుంచి తరలించడం సాధ్యం కాదు. గత ఐదేళ్లలో వైసీపీ ప్రభుత్వం నిర్వాసితుల పునరావాసాన్ని పూర్తి చేయకుండా దేవీపట్నం మండలంలోని ముంపు గ్రామాలన్నిటినీ తరలించడం నేడు వివాదంగా మారింది. కాగా కనీసం తొలిదశలో +41.15 మీటర్ల కాంటూరు స్థాయిలో పూర్తి చేయడానికి 172 ఆవాసాల్లో 38 వేల నిర్వాసిత కుటుంబాలలో 25,263 కుటుంబాల పునరావాసాన్ని, 1 లక్ష ఎకరాలకుగానూ ఇంకా 16,440 ఎకరాల భూసేకరణ చేపట్టాల్సి ఉంది. 121 కాలనీలలో ఇంక 95 కాలనీలను నిర్మించాల్సి ఉంది. వీటిలో పునరావాసానికి రూ.4,787 కోట్లు, భూసేకరణ కోసం రూ.2,328 కోట్లు కావాలి. వీటిని పరిశీలించిన రాష్ట్ర ప్రభుత్వం మొత్తంగా తొలిదశ ప్రాజెక్టు సంపూర్ణానికి రూ.12,157 కోట్లు అవసరమవుతాయని కేంద్ర జలవనరుల మంత్రిత్వ శాఖను ఇప్పటికే కోరింది. తాజా బడ్జెట్‌లో పోలవరం కోసం నిధుల కేటాయింపు లేనప్పటికీ విభజన చట్ట హామీలను నెరవేర్చడానికి సిద్ధమైన కేంద్రం దశలవారీగా పోలవరానికి నిధులను విడుదల చేస్తుందన్న ఆశాభావం సర్వత్రా వ్యక్తమవుతోంది.

కేంద్ర బడ్జెట్‌పై హర్షం

కేంద్ర బడ్జెట్‌పై అన్ని వర్గాలకు చెందిన వారు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా ఏపీకి వరాల జల్లు కురిపించడంపై ఆనందపడుతున్నారు. అమరావతికి రూ.15 వేల కోట్ల కేటాయింపుపై హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. పలువురి అభిప్రాయాలు వారి మాటల్లోనే..

మండపేట, రాజమహేంద్రవరం సిటీ, కాకినాడ సిటీ, దివాన్‌చెరువు

అమరావతికి నిధుల కేటాయింపు హర్షణీయం

- వేగుళ్ల జోగేశ్వరరావు, ఎమ్మెల్యే



రాజధాని అమరావతికి రూ.15000 కోట్లను కేటాయించడం హర్షణీయం.. ప్రధాని నరేంద్రమోదీ, ఆర్థిక శాఖ మంత్రి నిర్మలాసీతారామన్‌కు కృతజ్ఞతలు.. పదేళ్ల తర్వాత ఏపీకి మంచిరోజులు వచ్చాయి. సీఎం చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్, మంత్రి లోకేశ్‌కు అభినందనలు. రాష్ట్రానికి నిధులు రావడంతో పాటు యువతకు ఉపాధి అవకాశాలు పెరుగుతాయి..

ఇక ఏపీ అభివృద్ధి దిశగా పరుగులు

- వేగుళ్ల లీలాకృష్ణ, జనసేన ఇన్‌చార్జి, మండపేట



పదేళ్ల పాటు వెనుకబడిన ఆంధ్రప్రదేశ్ ఇప్పుడు కూటమి ప్రభుత్వంలో అభివృద్ధిలో పరుగులు పెట్టడం ఖాయం. రాజధాని కోసం రూ.15 వేల కోట్లను కేటాయించటం ద్వారా ఇది నిరూపితమైంది. కేంద్రం నుంచి నిధులు వచ్చేలా కృషి చేసిన సీఎం చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్, మంత్రి లోకేశ్‌లకు అభినందనలు. బడ్జెట్‌లో అధిక నిధులు కేటాయించిన ప్రధాని మోదీ, ఆర్థిక మంత్రి నిర్మలాసీతారామన్‌కు కృతజతలు..

ఐదేళ్ల తర్వాత బడ్జెట్‌లో ఏపీకి గుర్తింపు

ఆదిరెడ్డి శ్రీనివాస్, ఎమ్మెల్యే



ఐదేళ్ల తర్వాత కేంద్ర బడ్జెట్‌లో మన రాష్ట్రానికి మంచి గుర్తింపు ఇచ్చింది. ఇది మన రాష్ట్రానికి ఆక్సిజన్ వంటిది. అయితే దీనితోనే అంతా అయిపోదు, కేంద్ర సాయానికి మన కష్టం కూడా తోడవ్వాలి. అందరం కలిసి కష్టపడి మన రాష్ట్రాన్ని అభివృద్ధి చేసుకుందాం. బడ్జెట్‌లో కేటాయింపులు చేసిన కేంద్రానికి, ప్రధాని మోదీకి ధన్యవాదాలు. ఈ స్ఫూర్తితో ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి అందరం నడుంబిగిద్దాం..

అమరావతికి నిధుల కేటాయింపు సంతోషదాయకం

గన్ని కృష్ణ, టీడీపీ నేత



కేంద్ర ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్ ప్రయోజనాలకు అనుగుణంగా ఉంది. రాష్ట్ర విభజన తర్వాత గత ఐదేళ్ల వైసీపీ పాలనలో రాష్ట్రం ఆర్థికంగా నష్టపోయిన ఆంధ్రప్రదేశ్‌ను ఆదుకునేలా బడ్జెట్‌లో కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ చేసిన నిధుల కేటాయింపు, హామీలు ఆనందాన్ని కలిగించాయి.అమరావతి అభివృద్ధికి రూ.15 వేల కోట్ల ఆర్థిక సాయం ఇస్తామని వెల్లడించడం సంతోషించే విషయం.

రైతుల త్యాగాలను గుర్తించిన కేంద్రం

- మాజీ ఎమ్మెల్సీ ఆదిరెడ్డి అప్పారావు



కేంద్ర ప్రభుత్వం రాష్ట్రంలో అమరావతి రైతులను త్యాగాలను గుర్తించి ఈ బడ్జెట్‌లో రూ. 15 వేల కోట్లు కేటాయింపులు చేయడం చాలా ఆనందంగా ఉంది. అదే విధంగా పోలవరం ప్రాజెక్టు నిర్మాణానికి పూర్తి సహకారం అందిస్తామని ప్రకటించడంతో ప్రధాని మోదీకి రాష్ట్ర ప్రజలు ధన్యవాదాలు తెలుపుతున్నారు.

పన్ను స్లాబ్ రేట్లు సవరించడం వల్ల ఆదా

ఏపీఎన్జీవోస్ నేత గుద్దటి రామ్మోహనరావు



కొత్త పన్ను స్లాబ్ రేట్లు సవరించడం వల్ల ఉద్యోగులకు రూ.17,500 వరకు ఆదా అవుతుంది. స్టాండర్డ్ డిడక్షన్ రూ.50వేల నుంచి రూ.75వేలకు పెంచారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రాజధాని అమరావతి నిర్మాణానికి రూ.15వేలకోట్ల ఆర్థిక సాయం, పోలవరం ప్రాజెక్టుకు అధిక నిధులు కేటాయింపు, వెనుకబడిన ప్రాంతాలకు ప్రత్యేక ప్యాకేజీ, వైజాగ్ నుంచి చెన్నై వరకు ఇండస్ట్రియల్ కారిడార్‌కు నిధులు కేటాయింపు జరగడం శుభ పరిణామం

రాష్ట్రానికి అధిక నిధులు శుభపరిణామం

తాటిపాక మధు, సీపీఐ నేత



కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి అధిక నిధులు రావడం శుభపరిణామం. అన్నిప్రాంతాలు, అన్నిరంగాల అభివృద్ధికి కేంద్రం నుంచి కూటమి ప్రభుత్వం భారీగా నిధులు రాబట్టింది. నిధులు రాబట్టడంలో సీఎం చంద్రబాబు ఢిల్లీ పర్యటన ఫలించింది. ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి రూ.15వేల కోట్ల ఆర్థికసాయం, పోలవరం ప్రాజెక్టు పూర్తికి అధిక నిధులు, రాయలసీమ, ప్రకాశం, ఉత్తరాంధ్ర జిల్లాలకు ప్రత్యేక ప్యాకేజీ హర్షణీయం..కాకినాడ రైల్వే మెయిన్‌లైన్‌కు నిధులు రాబట్టాలి.

కోశ లోటు బడ్జెట్ ఇదే..

డాక్టర్ పి.లక్ష్మీనారాయణ, ఆర్థిక శాస్త్ర ప్రొఫెసర్



కొవిడ్ తర్వాత అత్యంత తక్కువ కోశలోటు ఉన్న బడ్జెట్ ఇదే. కేంద్ర తాజా బడ్జెట్‌లో కోశలోటు 4.9 శాతం ఉంది. దీనివల్ల వస్తువుల ధరలు ఆ మేరకు పెరగవచ్చు. అయితే ఎఫ్‌ఆర్‌బీఎం చట్టంలో కోశలోటు 3 శాతం మించకూడదన్న నిబంధన ఉంది. భవిష్యత్‌లోనైనా ఈ నిబంధనలను పాటిస్తే బాగుంటుంది.

విద్యుత్ ప్రమాదాలను ఇలా అరికడదాం

ఏపీఈపీడీసీఎల్ ఎస్‌ఈ టీవీఎస్ఎన్ మూర్తి



రాజమహేంద్రవరం సిటీ, జూలై 23: విద్యుత్ భద్రతా ప్రమాణాలు పాటిస్తూ ప్రమాదాలు నివారిద్దామని విద్యుత్ వినియోగదారులకు ఏపీఈపీడీసీఎల్ ఎస్ఈ టీవీఎస్ఎన్ మూర్తి సూచించారు. ఈమేరకు మంగళవారం రాత్రి ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. భారీ వర్షాలు, గాలులు ఉన్నప్పుడు ప్రజలు విద్యుత్ ప్రమాదాలకు గురికాకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. తుఫాను సమయంలో ఇంటి గృహోపకరణాల స్విచ్‌లను ఆఫ్ మోడ్లో ఉంచాలని, ఇంటి లోపల కరెంటు స్విచ్ బోర్డులో స్విచ్‌లను తడి చేతులతో ఆన్, ఆఫ్ చేయరాదన్నారు. చిన్నపిల్లలను కరెంట్ వస్తువులను తాకనీయరాదని, ఇంటి సర్వీసు వైరు తెగినా, జాయింట్స్ కట్ అయినా వాటిని ఎట్టి పరిస్థితుల్లోనూ తాకకూడదన్నారు. వర్షం పడుతున్నప్పుడు విద్యుత్ స్తంభాలు, స్టే వైర్లను ముట్టుకోరాదని, ఇంటి పరిసరాల్లో చెట్లు, కరెంట్ పోల్స్ పడినా, వాలినా, కరెంటు వైర్లు తెగినా వెంటనే విద్యుత్ కార్యాలయం లేదా, కంట్రోల్ రూమ్‌కు సమాచారం ఇవ్వాలన్నారు. ఇంటి ఆవరణలో ఉన్న నీళ్ల మోటారు, నీటి పంపులను, వాటికి ఉన్న కరెంటు వైర్లను, జాయింట్స్‌ను తాకకూడదన్నారు. ఏ ప్రదేశంలోనైనా విద్యుత్ ప్రసారం జరిగే తీగలు (కండక్టర్) తెగి పడి ఉంటే దానిని విద్యుత్ ప్రసారం ఉన్నదిగా పరిగణించి వాటిని నేరుగా తాకకుండా వెంటనే విద్యుత్ శాఖకు లేదా టోల్‌ఫ్రీ నెంబరు 1912కి తెలియజేయాలన్నారు, పంటపొలాల వద్ద మోటార్లు వర్షం నీటిలో మునిగి ఉండటం, పూర్తిగా తడవడం వల్ల షార్ట్ సర్క్యూట్ జరిగే ప్రమాదం ఉన్నందున రైతులు జాగ్రత్తగా ఉండాలని సూచించారు.

భద్రాచలం వైపు ప్రయాణాలకు అడ్డుకట్ట

రహదారిని మూసివేసిన తెలంగాణ ప్రభుత్వం



ఇసుక మూటలతో రహదారిని మూసివేసిన దృశ్యం

ఎటపాక, జూలై 23: విలీన మండలాల వాసులు తెలంగాణకు వెళ్లే ప్రధాన రహదారిలో భద్రాచలం వద్ద ఆ రాష్ట్ర అధికారులు ఇసుక మూటలతో అడ్డుకట్ట వేశారు. దీంతో విలీన వాసులు భద్రాచలం వెళ్లేందుకు గత రెండు రోజుల నుంచి అవస్థలు పడుతున్నారు. భద్రాచలం పట్టణానికి వరద ముంపు లేకుండా ఉండేందుకు గత నాలుగైదు నెలలుగా భద్రాచలం శివారు ప్రాంతంలో ఆ రాష్ట్ర ప్రభుత్వం కరకట్ట నిర్మాణ పనులు చేపడుతోంది. దాదాపుగా ఆ పనులు పూర్తి దశకు చేరాయి. అయితే గోదావరి వరద పెరగడంతో వరదనీరు ఈ ప్రధాన రహదారి నుంచి కరకట్ట నిర్మాణం చేపట్టే వైపు చేరి ముంపునకు గురయ్యే ప్రమాద ముందని గుర్తించిన అక్కడి అధికారులు భద్రత రీత్యా విజయవాడ- జగదల్‌పూర్ జాతీయ రహదారిని ఇసుక మూటలతో మూసివేయించారు. దీంతో గత రెండు రోజులుగా ఈ రహదారి వైపు వెళ్లాల్సిన వాహనాలు ఏపీలోని పురుషోత్తపట్నం నుంచి తెలంగాణలోని భద్రాచలానికి ఇరుకు రహదారిలో వెళుతున్నాయి.

వీరేంద్రకుమార్‌ను స్వదేశానికి తీసుకువచ్చేందుకు ఏర్పాట్లు పూర్తి

అంబాజీపేట, జూలై 23: ఏజెంట్ చేసిన మోసంతో సౌదీ అరేబియాలో ఒంటెల కాపరిగా పనిచేస్తున్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఇసుకపూడికి చెందిన సరెళ్ల వీరేంద్రకుమార్‌ను అక్కడ నుండి ఇండియాకు తీసుకురావడానికి అన్ని ఏర్పాట్లు పూర్తిచేసినట్లు జిల్లా కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ తెలిపారు. ఈ మేరకు కలెక్టర్ ప్రాంతీయ పాస్‌పోర్టు అధికారి హైదరాబాద్‌ను సంప్రదించి, సౌదీలలోని ఇండియన్ ఎంబీసీ అధికారులతో మాట్లాడారు. సౌదీ అరేబియా దామామ్‌లోని కింగ్ ఫహద్ అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి హైదరాబాద్‌లోని రాజీవ్‌గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయానికి వీరేంద్రకుమార్‌ను తీసుకువచ్చేందుకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు కలెక్టర్ చెప్పారు. బుధవారం మధ్యాహ్నానికి వీరేంద్రకుమార్ స్వదేశానికి తిరిగి వస్తారని కలెక్టర్ ఓ ప్రకటనలో తెలిపారు.

గంజాయితో నలుగురి అరెస్టు

మలికిపురం, జూలై 23: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మలికిపురం సత్యజ్యోతి థియేటర్ వద్ద గంజాయి అమ్ముతున్న నలుగురిని అదుపులోకి తీసుకుని కోర్టులో హాజరుపరిచినట్లు మలికిపురం ఎస్ఐ బి.సంపత్‌కుమార్ తెలిపారు. వారి నుంచి 400 గ్రాముల గంజాయి స్వాధీనం చేసుకున్నట్టు చెప్పారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత చెడు మార్గాల్లో ప్రవేశించకుండా చదువుపైనా, కెరీర్‌పైన దృష్టి సారించాలన్నారు. మలికిపురం పరిధిలో గంజాయి విక్రయాలపై పూర్తి నిఘా ఉంచామన్నారు.

తూర్పుగోదావరి
• రాజమహేంద్రవరం సిటీ/ రూరల్ • రాజానగరం • అనపర్తి • కొవ్వూరు • నిడదవోలు • గోపాలపురం
ఆంధ్రజ్యోతి www.andhrajyothy.com

ఏజెన్సీ సమాచారం

వరద సహాయక చర్యల్లో అలసత్వం వద్దు

పారిశుధ్యం, తాగునీటిపై ప్రత్యేక దృష్టి పెట్టాలి

విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు: కలెక్టర్ దినేష్‌కుమార్



పునరావాస కేంద్రాల్లో బాధితులతో మాట్లాడుతున్న కలెక్టర్ దినేష్

ఎటపాక, జూలై 23: గోదావరి వరద సహాయక చర్యల్లో అలసత్వం వహించరాదని, గోదావరి పరివాహక ప్రాంతాల ప్రజలను ఎప్పటికప్పుడు అప్రమత్తం చేస్తూ, కంట్రోల్ రూమ్‌లు అందుబాటులో ఉండాలని జిల్లా కలెక్టర్ దినేష్‌కుమార్ అధికారులను ఆదేశించారు. కలెక్టర్ దినేష్‌కుమార్ మంగళవారం ఎటపాక ఎంపీడీవో కార్యాలయం సమావేశ మందిరంలో గోదావరి వరద పరిస్థితులకు చేపట్టాల్సిన సహాయక చర్యలపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. పునరావాస కేంద్రాల్లో ముంపు బాధితులకు అన్ని రకాల సౌకర్యాలు కల్పించాలని, ప్రధానంగా బియ్యం, నిత్యావసరాలను అందించాలన్నారు. పారిశుధ్యం, తాగునీరు, విద్యుత్ సరఫరా సక్రమంగా అమలు జరిగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. గోదావరి వరద తగ్గినా, అధికారులు అప్రమత్తంగా ఉంటూ పర్యవేక్షించాలని సూచించారు. అనంతరం కలెక్టర్ భద్రాచలం- కూనవరం రోడ్‌లో నెల్లిపాక బంకు సమీపంలో ముంపునకు గురైన ప్రధాన రహదారిని పరిశీలించారు. అనంతరం గ్రామస్థులతో కలెక్టర్ మాట్లాడారు. గోదావరి వరద సమయంలో తమ గ్రామానికి బయట ప్రపంచంతో సంబంధాలు తెగిపోతాయని, తమ గ్రామాన్ని 41.15 కాంటూరు జాబితాలో చేర్చి, ఆర్అండ్ఆర్ ప్యాకేజీ ఇవ్వాలని కోరారు. సీతాపురం జడ్పీ హైస్కూల్ పునరావాస కేంద్రంలో ఉంటున్న గొల్లగూడెం గ్రామ వరద బాధిత కుటుంబాలకు అందుతున్న సౌకర్యాలపై కలెక్టర్ ఆరా తీశారు. తమకు కేవలం బియ్యం మాత్రమే పంపిణీ చేశారని, బాధితులు కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. దీంతో కలెక్టర్ స్పందించి వీఆర్వోను ప్రశ్నించారు. బియ్యం ఒక్కటి ఇస్తే సరిపోతుందా ..నిత్యవసరాలు ఇవ్వరా అంటూ సున్నితంగా మందలించారు. వెంటనే నిత్యవసరాలు అందజేయాలని ఆదేశించారు. ఎటపాక మండలం పర్యటనకు వచ్చిన కలెక్టర్‌కు అనేక మంది ప్రజాప్రతినిధులు పలు సమస్యలపై వినతిపత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ అభిషేక్ గౌడా, ఐటీడీఏ పీవో కావూరి చైతన్య, తహసీల్దార్ శేఖర్ పాల్గొన్నారు.

కేంద్ర బడ్జెట్‌లో నిధుల కేటాయింపుపై హర్షం



రంపచోడవరం, జూలై 23: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో రాజధాని పునఃనిర్మాణానికి రూ.15 వేల కోట్లు కేటాయించడంపై ఎమ్మెల్యే మిరియాల శిరీషాదేవి హర్షం వ్యక్తం చేశారు. బడ్జెట్‌లో రాష్ట్రానికి అధిక నిధులు కేటాయించిన ఘనత ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకే దక్కుతుందన్నారు. పోలవరం ప్రాజెక్టు, వైజాగ్, చెన్నై పారిశ్రామిక కారిడార్ నిర్మాణానికి నిధులు కేటాయింపు, అలాగే వెనుకబడిన ఉత్తరాంధ్ర, రాయలసీమ, ప్రకాశం జిల్లాల అభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయించడం హర్షణీయమన్నారు.

కలెక్టర్ ఆదేశించినా బేఖాతర్

రోడ్డుకు మరమ్మతులు చేయని అధికారులు

కూనవరం, జూలై 23: భద్రాచలం వెళ్లేందుకు ప్రత్యామ్నాయ మార్గంగా బోదునూరు రోడ్డుకు మరమ్మతులు చేయాలని సాక్షాత్తు అల్లూరి జిల్లా కలెక్టర్ దినేష్‌కుమార్ ఆదేశించినప్పటికీ కింది స్థాయి అధికారులు ఆయన ఆదేశాలను బేఖాతరు చేశారు. గోదావరి వరద ప్రవాహం ఎక్కువైతే భద్రాచలం వెళ్లేందుకు రహదారులన్నీ మూసుకుంటాయి. అయితే బోదునూరు, ఏడురాళ్లపల్లి మీదుగా భద్రాచలం వెళ్లేందుకు ప్రత్యేక మార్గముంది. ఆ మార్గం నుంచే నిత్యావసర సరుకులు వరదల సమయంలో కూనవరానికి దిగుమతి చేస్తుంటారు. వరదల సమయంలో స్వచ్ఛంద సంస్థలు సైతం ఆ మార్గం నుంచే వచ్చి ఇక్కడ వరద బాధితులకు ఆహార పొట్లాలు, బియ్యం, నిత్యావసర వస్తువులు అందిస్తారు. అయితే వర్షాకాలం కావడంతో ఆ రోడ్డు బురదమయంగా మారింది. లారీలు, ట్రాక్టర్లు మార్గమధ్యంలో బురదలో దిగబడతాయి. మంగళవారం రెడ్‌క్రాస్ సంస్థ నిత్యావసర సరుకులు, టార్పాలిన్లు తీసుకుని కోతులగుట్ట పునరావాస కేంద్రానికి తరలించేందుకు బయలుదేరింది. కానీ బురదలో రెడ్‌క్రాస్ సంస్థకు చెందిన ట్రాక్టర్ దిగబడి పోవడంతో ఉదయం 9 గంటల నుంచి చీకటి పడే వరకు అక్కడే ఉండాల్సిన పరిస్థితి వచ్చింది. కలెక్టర్ ఆదేశాలు పాటించి అధికారులు ఆ రోడ్డుకు మరమ్మత్తులు చేసి ఉంటే ఈ రోడ్డుకు ఆ పరిస్థితి వచ్చేది కాదు. మిగతా స్వచ్ఛంద సంస్థలు సైతం ఆ మార్గం గుండా ఈ ప్రాంతానికి వచ్చి వరద బాధితులకు సహాయం అందించేవి. అధికారుల నిర్లక్ష్యం కారణంగా రోడ్డుకు మరమ్మతులు చేయకపోవడంతో ఈ సమస్య తలెత్తింది.

ముంపు గ్రామాల్లో యుద్ధప్రాతిపదికన చర్యలు

కూనవరం, జూలై 23: గోదావరి ముంపు గ్రామాల్లో యుద్ధ ప్రాతిపదికన చర్యలు చేపడుతున్నట్లు కూనవరం మండల ప్రత్యేకాధికారి, రంపచోడవరం ఐటీడీఏ పీవో సూరజ్ గనోరే తెలిపారు. మండలంలో పరిస్థితిని చక్కదిద్దాలంటూ టీడీపీ నాయకులు మంగళవారం పీవోను కోరారు. ఈ సందర్భంగా పీవో మాట్లాడుతూ ఎటువంటి అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు ఎక్కడికక్కడ బోట్లు ఏర్పాటు చేశామన్నారు. పునరావాస కేంద్రాల్లో సోలార్ లైట్లు ఏర్పాటు చేస్తామన్నారు. అంతే కాకుండా పోలిపాక గ్రామంలో విద్యుత్ లేకపోవడంతో ఆ గ్రామానికి ప్రత్యామ్నాయంగా వేరే ప్రాంతం నుంచి విద్యుత్ సరఫరా చేయాలని అధికారులను ఆదేశించారు. ఇప్పటికే రెండు నెలలకు సరిపడ బియ్యం పంపిణీ చేశామని, నిత్యావసర సరుకులు బుధవారం నుంచి పంపిణీ చేస్తామన్నారు. వరద తగ్గే వరకు ఇక్కడే బస చేస్తామని పీవో తెలిపారు. టీడీపీ అరకు పార్లమెంటు ప్రతినిధి ఎడవిల్లి భాస్కరరావు, మాజీ ఎంపీపీ పొడియం అప్పారావు పాల్గొన్నారు.

కంట్రోల్ రూంలో సమగ్ర సమాచారం ఉండాలి

చింతూరు, జూలై 23 : చింతూరు ఐటీడీఏలో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూంలో వరదలకు సంబంధించి సమగ్ర సమాచారం ఉండాలని అల్లూరి సీతారామరాజు జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్ అన్నారు. మంగళవారం వరద ప్రభావిత ప్రాంతాలలో పర్యటించిన అనంతరం కలెక్టర్ ఐటీడీఏ కంట్రోల్ రూంలో పరిస్థితిని పరిశీలించారు. వరద పరిస్థితిపై ఎప్పటికపుడు ముంపు ప్రాంతాలకు సమాచారం అందజేయాలన్నారు. అదే దశలో సమాచారాన్ని సంబంధిత శాఖల నుండి సేకరించి కంట్రోల్ రూంలో పొందుపర్చాలన్నారు. జాయింట్ కలెక్టర్ అభిషేక్ గౌడ్, చింతూరు ఐటీడీఏ పీవో కావూరి చైతన్య పాడేరు ఐటీడీఏ పీవో అభిషేక్ తదితరులు పాల్గొన్నారు.

డొంకరాయి జలవిద్యుత్ కేంద్రంలో విద్యుదుత్పత్తి

మోతుగూడెం, జూలై 23: సీలేరు కాంప్లెక్సులోని డొంకరాయి మినీ జల విద్యుత్ కేంద్రంలో మంగళవారం నుంచి విద్యుత్ ఉత్పత్తిని ప్రారంభించారు. ప్రస్తుతం కురుసున్న భారీ వర్షాలకు డొంకరాయి ఏపీపీ డ్యాం పూర్తిస్థాయికి చేరుకోవడంతో ఈ డ్యాం నీటి మట్టాలను తగ్గించడం కోసం డొంకరాయి విద్యుత్ కేంద్రంలో విద్యుత్ ఉత్పత్తిని నిలిపివేశారు. డొంకరాయి నుంచి పొల్లూరు జల విద్యుత్ కేంద్రానికి నీటిని విడుదల చేసే పవర్ కెనాల్ సామర్థ్యం 4 వేల క్యూసెక్కులు మాత్రమే కావడంతో ఏపీపీ డ్యాం నుంచి వచ్చే వరద నీటిని పవర్ కెనాల్ విడుదల చేయాల్సి రావడంతో డొంకరాయిలో విద్యుత్ ఉత్పత్తిని నిలిపివేశారు. ప్రస్తుతం ఏపీపీ డ్యాంకు వరద తాకిడి తగ్గడంతో డొంకరాయిలో విద్యుత్ ఉత్పత్తిని ప్రారంభించినట్లు జెన్‌కో అధికారులు తెలిపారు. 11.50 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తిని నిర్వహిస్తున్నామని జెన్‌కో అధికారులు తెలిపారు.

నిలకడగా గోదావరి

దేవీపట్నం, జూలై 23: గోదావరి ప్రవాహం సోమవారం సాయంత్రం నుంచి నిలకడగా ఉంది. మంగళవారం వాన తెరిపిచ్చింది. మండలంలోని ఇందుకూరుపేట గ్రామానికి చెందిన మాదాసు సత్యనారాయణ గృహం కుప్పకూలింది. నష్టపరిహారం ఇవ్వాలని ఆదివాసీ నాయకులు డిమాండ్ చేశారు. మరో పక్క పోశమ్మగండి, దండంగి గ్రామాల్లో ప్రజలు గోదావరి నది వద్దకు వెళ్లకుండా పోలీసులు గస్తీ ఏర్పాటు చేశారు.

కొవ్వూరు-భద్రాచలం రోడ్డు రైలు మార్గానికి నిధులు కేటాయించాలి

రైల్వే సమస్యలపై కేంద్రమంత్రితో ఎంపీ పురందేశ్వరి చర్చలు



కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్వినీవైష్ణవ్‌తో సమావేశమైన ఎంపీ పురందేశ్వరి

రాజమహేంద్రవరం అర్బన్, జూలై 23 : కొవ్వూరు-భద్రాచలం రోడ్డు రైలు మార్గానికి నిధులు కేటాయించాలని రాజమండ్రి ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి కేంద్ర రైల్వేశాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్‌ను కోరారు. సోమవారం కేంద్రమంత్రితో సమావేశమైన పురందేశ్వరి కొవ్వూరు-భద్రాచలం రైల్వే లైనును ప్రస్తావిస్తూ రూ.923.23 కోట్ల అంచనా వ్యయంతో సమాన షేరింగ్ ప్రాతిపదికన ఈ రైల్వే లైనును అభివృద్ధి చేయడానికి రైల్వే మంత్రిత్వశాఖ, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 2011లోనే అంగీకరించాయని వివరించారు. ఈ మార్గం ఏర్పాటైతే విశాఖపట్నం- సికింద్రాబాద్ మధ్య 147 కిలోమీటర్ల దూరం తగ్గుతుందని, రన్నింగ్ టైం ఆదా అవుతుందని తెలిపారు. ఈ రైల్వే లైను పూర్తయితే తెలంగాణ రాష్ట్రానికి పోర్టు కనెక్టివిటీ కూడా సాధ్యపడుతుందని వివరించారు. అలాగే రెండు తెలుగు రాష్ట్రాల వెనుకబడిన, గిరిజన ప్రాంతాల సామాజిక, ఆర్థిక వృద్ధి వేగవంతం అవుతుందని తెలిపారు. 2016-17లోనే డీపీఆర్ తయారుచేసి రైల్వే బోర్డుకు సమర్పించినప్పటికీ పురోగతి లేదని పురందేశ్వరి వివరించారు. ఈ ప్రాజెక్టు పూర్తి చేయాలని కేంద్రమంత్రిని పురందేశ్వరి కోరారు.

కొవ్వూరు రైల్వేస్టేషన్‌లో రైళ్ల హాల్టింగ్‌ను పునరుద్ధరించాలి

కొవిడ్ మహమ్మారికి ముందు కొవ్వూరు రైల్వే స్టేషన్‌లో 17488/17487, 17644/17643, 17240/17249, 13351/13352, 17250/17249, 17479/17480, 17244/17243, 17482/17481 తదితర రైళ్లకు హాల్టు ఉండేదని ఎంపీ పురందేశ్వరి కేంద్రమంత్రి దృష్టికి తెచ్చారు. కొవిడ్‌కాలంలో రద్దయిన ఈ రైళ్లను తర్వాత పునరుద్ధరించలేదని, సరైన కారణం లేకుండా కొవ్వూరులో హాల్టు తొలగించారని, ఆయా రైళ్లను వీలైనంత త్వరగా పునరుద్ధరించాలని ఎంపీ కోరారు.



ఫిర్యాదుదారుతో మాట్లాడుతున్న ఎస్పీ నరసింహ కిషోర్

ఫిర్యాదులకు త్వరితగతిన పరిష్కారం : ఎస్పీ

రాజమహేంద్రవరం, జూలై 23(ఆంధ్రజ్యోతి): జిల్లా పోలీస్ కార్యాలయానికి (డీపీవో) వచ్చిన ఫిర్యాదులకు చట్ట పరిధిలో త్వరితగతిన పరిష్కారం చూపడానికి అవసరమైన చర్యలు తీసుకుంటున్నామని ఎస్పీ డి.నరసింహ కిషోర్ పేర్కొన్నారు. సాధారణంగా ఫిర్యాదుదారులు రిసెప్షన్ వద్ద నమోదు చేసుకొని ఎస్పీ పిలుపుకోసం వేచి చూస్తుంటారు. అయితే ఎస్పీ నరసింహ కిషోర్ మంగళవారం నేరుగా వారి వద్దకు వెళ్లారు. వారితో మాట్లాడి సమస్యలపై ఆరా తీశారు. అర్జీలు స్వీకరించి న్యాయం చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రజా సమస్యలకు జాప్యం లేకుండా పరిష్కారం చూపాలని సూచించారు. ఎస్పీ తమ వద్దకు వచ్చి సమస్యను వినడంతో అర్జీదారులు సంతోషం వ్యక్తం చేశారు.



సిల్వర్ మెడల్ సాధించిన క్రీడాకారిణికి నగదు బహుమతి అందిస్తున్న దృశ్యం

టీటీ విజేతకు రూ.50 వేల నగదు బహుమతి

రాజమహేంద్రవరం కల్చరల్ జూలై 23: తూర్పుగోదావరి టేబుల్ టెన్నిస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్థానిక ఆర్ఎంసీ సిటీ బ్యాడ్మింటన్ కోర్టులో జరిగిన 2వ ఏపీ స్టేట్ ర్యాంకింగ్ టేబుల్ టెన్నిస్ టోర్నమెంటులో రాజమహేంద్రవరం గౌతమి టేబుల్ టెన్నిస్ అకాడమీకి చెందిన క్రీడాకారిణి యండమూరి వైష్ణవి సూర్య మహిళల విభాగంలో రన్నర్ అప్‌గా నిలిచి సిల్వర్ మెడల్ సాధించిన సందర్భంగా జిల్లా టీటీ అసోసియేషన్ అధ్యక్షుడు, ఏపీ టీటీఏ ఉపాధ్యక్షుడు విశ్వనాథ భాస్కరరామ్ మంగళవారం రూ.50వేల నగదును బహూకరించి అభినందించారు. సిల్వర్ మెడల్ విజేత వైష్ణవి మాట్లాడుతూ టీటీలో మరింతగా రాణించడానికి తగిన క్రీడా సామగ్రిని సమకూర్చుకోవడానికి నగదు బహూమతి నందజేసిన భాస్కర్‌రామ్‌కు కృతజ్ఞతలు తెలియజేశారు. జేవీవీ అప్పారెడ్డి, కె. సత్యనారాయణ(భీము), కోచ్ వీటీవీ సుబ్బారావు, పి.వేణుగోపాల్ పాల్గొన్నారు.

వారంలోగా కౌలు రైతుల సీసీఆర్ కార్డులు నమోదు పూర్తిచేయాలి : జేసీ

రాజమహేంద్రవరం రూరల్, జూలై23: జిల్లాలో కౌలు రైతులకు పంట సాగు దారుల హక్కు కార్డులు (సీసీఆర్‌సీ) నమోదు ప్రక్రియను వారం రోజుల్లోగా పూర్తిచేయాలని జాయింట్ కలెక్టర్ తేజ్‌భరత్ ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లో వీసీ ద్వారా మండల తహశీల్దార్లు, మండల వ్యవసాయ అధికారులతో కౌలు రైతులకు పంట సాగుదారుల హక్కు కార్డుల నమోదుపై సమీక్షించారు. ఈసందర్భంగా జేసీ మాట్లాడుతూ జిల్లాలో 271 రెవెన్యూ గ్రామాల్లో 1,09,450 మంది కౌలు రైతులకు సీసీఆర్‌సి కార్డ్స్ పంపిణీ లక్ష్యానికిగాను ఇప్పటివరకు 52,391 మంది సీసీఆర్‌సీ కార్డ్స్ నమోదు చేశారని, ఇది 48శాతంగా ఉందన్నారు. మిగిలిన 57,059 మంది కౌలు రైతులకు సంబంధించి వారం రోజుల్లో నూరు శాతం పూర్తి చేయాలని ఆయన అధికారులను ఆదేశించారు. జిల్లాలో 8 మండలాల్లో భారీ వర్షాలు, వరదలు ప్రభావంతో పంట పొలాలు నీటమునిగి నష్టపోయే అవకాశం ఉన్నందున సీసీఆర్‌సీ కార్డుల ప్రక్రియను పూర్తిచేయాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా వ్యవసాయ అధికారి ఎస్ మాధవరావు, డిఎం సివిల్ సప్లయిస్ టి రాధిక తదితరులు పాల్గొన్నారు.



మోదకొండమ్మ జాతరలో బోనాలు ఎత్తిన దృశ్యం

శ్రీరంగపట్నంలో ప్రారంభమైన మోదకొండమ్మ జాతర

కోరుకొండ, జూలై23: కోరుకొండ మండలం శ్రీరంగపట్నం మోదకొండమ్మ జాతర సందర్భంగా బోనాల ఉత్సవం కనువిందు చేసింది. ఈ గ్రామంలో వారంరోజులపాటు సాగే మోదకొండమ్మ జాతర మహోత్సవం మంగళవారం వైభవంగా ప్రారంభమైంది. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన వందలాది మంది మహిళలు బోనాలు ఎత్తుకుని గ్రామం అంతా తిరిగి వచ్చి మోదకొండమ్మకు బోనాలు సమర్పించారు. అంతకుముందు ఈ బోనాల ఉత్సవాన్ని ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ సతీమణి బత్తుల వెంకటలక్ష్మి, గ్రామసర్పంచ్ మద్దాల పెద్దఅమ్మాజీ, కోరుకొండ సర్పంచ్ కర్రి లక్ష్మిసరోజలతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటుచేశారు.

మురమండలో ప్రకృతి వ్యవసాయ సాగు సందర్శన

కడియం, జూలై 23: ప్రకృతి వ్యవసాయంతో రైతులకు ఎంతో మేలు జరుగుతుందని ప్రకృతి వ్యవసాయం జిల్లా ప్రాజెక్టు మేనేజర్ తాతారావు తెలిపారు. 'అటల్ బుజల్ యోజనా " పథకంలో భాగంగా మురమండ పాడిరైతు మరిడి సత్యనారాయణ సాగుచేస్తున్న ప్రకృతి వ్యవసాయాన్ని ప్రకృతి వ్యవసాయం జిల్లా ప్రాజెక్టు మేనేజర్ తాతారావు, అడిషనల్ డీపీఎం షేక్ మహబూబ్‌వలీ, డీడీహెచ్ శ్రీనివాసులులతో కలిసి మహారాష్ట్ర, కర్నాటక రాష్ట్రాలకు చెందిన రైతులు, వ్యవసాయ, ఉద్యాన, ఇరిగేషన్ శాఖలకు చెందిన అధికారులు సందర్శించారు. ఈ సందర్భంగా ప్రకృతి వ్యవసాయం సాగు చేసే విధానం, పంట దిగుబడి, పెట్టుబడి వంటి విషయాలను రైతు సత్తిబాబును అడిగారు.

'మోసం చేసిన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలి'

రాజమహేంద్రవరం సిటీ, జూలై 23 : ఐపి పెట్టిన వ్యక్తి ప్రభుత్వ భాగస్వామ్యంలో ఎలా వ్యాపారం చేశాడని శ్రీకృష్ణ యాదవ సంక్షేమ సంఘం నేతలు రవియాదవ్, నరేష్ యాదవ్ ప్రశ్నించారు. 50వ డివిజన్‌లో మంగళవారం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఐపి పెట్టి చాలా మందిని మోసం చేసిన టి శ్రీనివాస్‌యాదవ్ అనే వ్యక్తి నగరపాలక సంస్థలో మాస్ మీడియా పేరుతో నగరంలో హోర్డింగ్‌లు లీజుకు తీసుకుని వ్యాపారం చేశాడని, అతనిపై చర్యలు తీసుకోవాలని ఇప్పటికే కమిషనర్‌కు ఫిర్యాదు చేశామని వారు తెలిపారు.

టిడ్కో ఇల్లు లబ్ధిదారులకు కేటాయించాలి



ఆవ భూముల స్కాంపై విచారణ జరపాలి

అసెంబ్లీ సమావేశాల్లో రాజమహేంద్రవరం ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్

రాజమహేంద్రవరం సిటీ, జూలై23: సామాన్యుడు కల ఇల్లు. 2019లో అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు హయాంలో నిర్మించి గృహప్రవేశాలకు సిద్ధంగా ఉన్న టిడ్కో ఇళ్లను గత వైసీపీ ప్రభుత్వం లబ్ధిదారులకు కేటాయించలేదని రాజమహేంద్రవరం ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ అన్నారు. మంగళవారం జరిగిన అసెంబ్లీ సమావేశాల్లో రాజమహేంద్రవరానికి సంబంధించిన సమస్యలపై వాసు మాట్లాడారు. టిడ్కో ఇళ్ల లబ్ధిదారులు గత ప్రభుత్వ తప్పిదాల వల్ల చాలా నష్టపోయారని, అటు ఇంటి అద్దెలు కట్టుకుంటూ మరొకపక్క బ్యాంక్ ఈఎంఐలు కట్టలేక ప్రజలు పడిన బాధలు వర్ణనాతీతమన్నారు. టిడ్కో ఇళ్లపై దృష్టి సారించి లబ్ధిదారులకు కేటాయింపులు చేయాలన్నారు. ఎన్నికల కోడ్ రేపు వస్తుందనగా గత ప్రభుత్వం రాత్రికిరాత్రి రాజమహేంద్రవరంలో 20 వేల ఇళ్ల పట్టాలిచ్చి ప్రజలను మోసం చేశారన్నారు. ఆవ భూముల స్కాంలో గత ప్రభుత్వ నిర్వాకంపై విచారణ జరపాల్సిన అవసరం ఉందని ఆయన అన్నారు.

ఆంధ్రప్రదేశ్‌కు మేలు చేసే అద్భుత బడ్జెట్

అనపర్తి బీజేపీ ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి

అనపర్తి జూలై 23 : కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ ఆంధ్రప్రదేశ్‌కు మేలుచేసే అద్భుత బడ్జెట్ అని బీజేపీ ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. బడ్జెట్‌పై ఆయన మాట్లాడుతూ అన్ని పంటలపైనా 50 శాతం దాటి మద్దతు ధర పెంచడం రైతులకు అత్యంత ప్రయోజనం. ఉద్యోగ కల్పన నైపుణ్య అభివృద్ధికి పెద్దపీట వేయడం యువతకు ఎంతో మేలు. ఏపికి విభజన చట్టం ద్వారా రూ.15 వేల కోట్లు కేటాయించడం ప్రగతిని ఊతం ఇచ్చినట్టయిందని చెప్పారు. ప్రధాని నరేంద్రమోదీ, ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుతున్నానని రామకృష్ణారెడ్డి తెలిపారు.



తిలక్, అజాద్ చిత్రపటాల వద్ద నివాళులు అర్పిస్తున్న ఇన్‌చార్జి వీసీ

మహనీయులను ఆదర్శంగా తీసుకోవాలి

తిలక్, అజాద్ జయంతిలో నన్నయ ఇన్‌చార్జి వీసీ శ్రీనివాసరావు

దివాన్‌చెరువు, జూలై 23: దేశంకోసం ఎన్నో పోరాటాలు చేసిన మహనీయులను ఆదర్శంగా తీసుకుని మనమంతా జీవించాలని ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం ఇన్‌ఛార్జి ఉపకులపతి ఆచార్య వైశ్రీనివాసరావు అన్నారు. లోకమాన్య బాలగంగాధర తిలక్, చంద్రశేఖర్ అజాద్ జయంతి కార్యక్రమాన్ని నన్నయ విశ్వవిద్యాలయంలో మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఇన్‌చార్జి వీసీ శ్రీనివాసరావు మహనీయులైన తిలక్, అజాద్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య జి.సుధాకర్, వర్సిటీ అధికారులు పాల్గొన్నారు.



కడియం మండలంలో లంకలు మునక

కడియం, జూలై 23: రోజురోజుకీ పెరుగుతున్న గోదావరి వరద కారణంగా లంక ప్రాంతంలో పంటలు నీటమునిగాయి. కడియం మండలం పరిధిలో ఉన్న వేమగిరి నుంచి వెంకయ్యపేట, బుర్రిలంక, కడియపులంక, పొట్టిలంక వరకు ఆయా గ్రామాల రైతులతోపాటు వివిధ గ్రామాలకు రైతులు పొలాలను కౌలుకు తీసుకుని కౌలురైతులు, స్వంతభూమి ఉన్న రైతులు మామిడి, కొబ్బరి, సపోటా, జామ, నిమ్మ, నారింజ వంటి ఫల మొక్కలు, పూల మొక్కలును సాగు చేస్తుంటారు. వీటితోపాటు దొండ, బెండ, టమాట, మిర్చి, ఆనప వంటి కూరగాయల పంట, అరటి, కంద, పెండలం వంటి వాణిజ్య పంటలు సాగు చేస్తారు. గోదావరి వరద ఉధృతి తగ్గి నీరు లాగినప్పటికీ పంటకు నష్టం జరుగుతూనే ఉంటుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పారిశుధ్య కార్మికులకు రెయిన్‌కోట్లు అందజేత

బిక్కవోలు, జూలై 23: ఊలపల్లి పంచాయతీ కార్యాలయంలో మంగళవారం పారిశుధ్య కార్మికులకు రెయిన్‌కోట్లు, గ్లౌవ్స్, మాస్కులు అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ బండారు రమ్య, బిక్కవోలు పీహెచ్‌సీ మాజీ చైర్మన్ తొండాపు సురేష్‌కుమార్‌రెడ్డి, వైస్ఎంపీపీ పెంకే మంగయ్యమ్మ, ఎంపీటీసీ బండారు శివ, మాజీ సర్పంచ్ గేదెల సత్యనారాయణ, కార్యదర్శి కె. రామకృష్ణ పాల్గొన్నారు.

కొంకుదురు ఉన్నత పాఠశాలలో శిక్షా సప్తాహ్ కార్యక్రమాలు

బిక్కవోలు, జూలై 23: కేంద్ర ప్రభుత్వం జాతీయ విద్యా విధానం అమలు చేసి నాలుగేళ్లయిన సందర్భంగా నిర్వహిస్తున్న శిక్షా సప్తాహ్ వారోత్సవాలను కొంకుదురు ఉన్నత పాఠశాలలో ఘనంగా నిర్వహించారు. వివిధ పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం మల్లిపూడి శ్రీనివాస్, ఉపాధ్యాయులు వలీషా, ఈశ్వరరెడ్డి, సుధాకరరెడ్డి, చౌదరి, శిరీష, విద్యార్థులు పాల్గొన్నారు.

లైంగిక వేధింపుల నిరోధక కమిటీ ఏర్పాటుచేయాలి

సీతానగరం, జూలై 23: పనిచేస్తున్న చోట లైంగిక వేధింపులు నిరోధించడానికి లైంగిక్ వేధింపుల నిరోధక కమిటీని ఏర్పాటుచేసుకోవాలని ఏసీడీపీవో పి. వరలక్ష్మి సూచించారు. మంగళవారం సీతానగరంలోని మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన బాలల హక్కులు, బాల్య వివాహాలపై అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ కృష్ణప్రసాద్, తహశీల్దార్ నెల్సన్‌బాబు, డా. చైతన్య, పిసి రాజన్న దొర డిసీపీవో సి.రాజకుమార్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఎం వరలక్ష్మి, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

చిన్నారులపై అఘాయిత్యాలపై అప్రమత్తంగా ఉండాలి

అనపర్తి, జూలై 23: సమాజంలో బాలికలకు, మహిళలకు రక్షణ కరువవుతున్న తరుణంలో బాలికలు, మహిళలు అప్రమత్తంగా ఉండాలని స్త్రీ శిశు సంక్షేమ శాఖ వలంటీర్ దుర్గాదేవి అన్నారు. మంగళవారం అనపర్తిలోని ఎస్ఆర్‌జెడ్‌పిహెచ్ పాఠశాలలో ఐసిడిఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన బేటీ బచావో బేటీ పడావో కార్యక్రమంలో ఆమె పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా బాలికలు పాఠశాల ఆవరణలో బేటీ బచావో బేటీ పడావో అంటూ నిర్వహించిన మానవహారం ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్‌వైజర్ ఛాయాదేవి, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఉపాధ్యాయులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

డైరెక్టరు పండుకు ఘనస్వాగతం

దివాన్‌చెరువు, జూలై23 : ది ఆర్యాపురం కోఆపరేటివ్ అర్బన్ బాంకు డైరెక్టరుగా ప్రమాణస్వీకారం చేసిన నీలపాలసూర్య సత్యనారాయణ (పండు)కు తన స్వగ్రామమైన దివాన్‌చెరువులో టీడీపీ-జనసేన- బీజేపీ కూటమి నాయకులు మంగళవారం ఘనస్వాగతం పలికారు. ఆయనను పూలమాలలు, దుశ్శాలువాలతో సత్కరించి అభినందించారు. టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గంగిశెట్టి చంటిబాబు కూడా పండును ప్రత్యేకంగా అభినందించారు.

విద్యార్థి మృతదేహం లభ్యం

సీతానగరం,జూలై 23: సీతానగరం మండలం ఉండేశ్వరపురం గ్రామానికి చెందిన పిప్పళ్ళ రాంబాబు (15) మృతదేహం మంగళవారం లభ్యమైంది. ఆదివారం సాయంత్రం అదృశ్యమైన పిప్పళ్ళ రాంబాబు విగతజీవుడై కనిపించడంతో తల్లిదండ్రుల వేదన వర్ణనాతీతం. తిరుమలలో చదువుతున్న రాంబాబు సెలవులకు ఇంటికి వచ్చాడు. ఇంటివద్ద సెల్‌ఫోన్‌తో ఆడుతుండగా తండ్రి మందలించడంతో మనస్తాపానికి గురై ఇంటి నుంచి సైకిల్ మీద వెళ్లిపోయాడు. గాలిస్తుండగా కొందురు మిర్తిపాడు వంతెన కాల్వలో మృతదేహాన్ని గుర్తించారు.


పవన్ సహకారంతో బడ్జెట్‌లో అధిక నిధులు

జనసేన రాజమహేంద్రవరం ఇన్చార్జి అనుశ్రీ సత్యనారాయణ

రాజమహేంద్రవరం సిటీ, జూలై23: జనసేన అధినేత ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ సహకారంతో రాష్ట్రానికి కేంద్ర బడ్జెట్‌లో అధిక నిధులు కేటాయించారని ఆ పార్టీ రాజమహేంద్రవరం ఇన్చార్జి అనుశ్రీ సత్యనారాయణ అన్నారు. ఈమేరకు మంగళవారం రాత్రి ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. పోలవరం నిర్మాణానికి, ముందుగా అమరావతి రాజధాని నిర్మాణానికి కేంద్రం రూ.15 వేల కోట్లు కేటాయించడం శుభపరిణామమన్నారు. జగన్ పాలనలో వెనుకబడిన రాష్ట్రాన్ని గాడిలో పెట్టడానికి కేంద్రం సహకరించడం ఆనందంగా ఉందని, చంద్రబాబు నేతృత్వంలో పవన్ సహకారంతో రాష్ట్రం అభివృద్ధి సాధిస్తుందన్నారు.

'గతంలో పోల్చితే వంద శాతం బెటర్ బడ్జెట్'

రాజమహేంద్రవరం సిటీ, జూలై 23: అమరావతికి రూ.15 వేల కోట్లు కేటాయించడం ఆనందకరమని రాజమండ్రి చాంబర్ మాజీ అధ్యక్షుడు దొండపాటి సత్యంబాబు అన్నారు. బడ్జెట్‌పై ఆయన స్పందిస్తూ పోలవరం ప్రాజెక్టును కూడా కేంద్రమే పూర్తి చేయాలి. వెనుకబడిన జిల్లాలకు ప్రత్యేకంగా నిధులు ఎంత ఇస్తున్నామో స్పష్టం చేసివుంటే బాగుండేది. గోదావరి జిల్లాలను పర్యాటకంగా అభివృద్ధి చేసే ప్రాజెక్టును కేంద్రం చేపడితే చాలా రెవెన్యూ వాటి ద్వారా ప్రభుత్వాలకు వస్తుంది. గతంలో ఆంధ్రప్రదేశ్ ఊసే కేంద్ర బడ్జెట్‌లో ఉండేదికాదు, ఇప్పుడు ప్రాధాన్యం చూస్తే గతంలో పోలిస్తే వంద శాతం ఇది బెటర్ బడ్జెటేనని చెప్పారు.



సమావేశంలో మాట్లాడుతున్న ప్రకాశ్ బాబు

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

డీఎల్ఎస్ఏ కార్యదర్శి ప్రకాశ్‌బాబు

రాజమహేంద్రవరం, జూలై 23(ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ (డీఎల్ఎస్ఏ) కార్యదర్శి కె.ప్రకాశ్‌బాబు పేర్కొన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణపై మంగళవారం నిర్వహించిన అవగాహనా కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ అతి వేగం ప్రమాదకరమన్నారు. హెల్మెట్, సీటుబెల్టు లేకుండా వాహనాలను నడిపితే రూ.వెయ్యి జరిమానా విధించే అవకాశం ఉందన్నారు. సెల్‌ఫోన్ మాట్లాడుతూ నడిపితే రూ.1500, రెండోసారి పట్టుబడితే రూ.10వేలు, ఇన్సూరెన్స్ లేకుండా డ్రైవ్ చేస్తే రూ.2 వేలు, డ్రైవింగ్ లైసెన్సు లేకపోతే రూ.5 వేలు జరిమానా కట్టాల్సి ఉంటుందన్నారు. ఇందులో జిల్లా రవాణా అధికారి కేఎస్ఎంవీ కృష్ణారావు, ఎంవీఐలు సీహెచ్ సంపత్‌కుమార్, రామ్‌నారాయణ పాల్గొన్నారు.



వెన్నుపూస విరిగిన యువకుడు శ్రీనివాస్‌కు వీల్‌చైర్ అందజేస్తున్న జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ లక్ష్మీ సూర్యప్రభ, వైద్యులు, స్టాఫ్

జీజీహెచ్ వైద్య ఉద్యోగుల ఉదారత

వెన్నుపూస విరిగిన యువకునికి రూ.20 వేల వీల్‌చైర్ వితరణ

రాజమహేంద్రవరం అర్బన్,జూలై23: రాజమహేంద్రవరం జీజీహెచ్‌లోని కిందిస్థాయి వైద్యఉద్యోగులు తమ ఉదారత చాటుకున్నారు. రోడ్డు ప్రమాదంలో వెన్నుపూస విరిగి మంచానికే పరిమితమైన ఒక యువకునికి రూ.20 వేల విలువైన వీల్‌ఛైర్‌ను వితరణ చేసి మానవత్వాన్ని చాటుకున్నారు. మంగళవారం జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ లక్ష్మీ సూర్యప్రభ చేతులమీదుగా బాధిత యువకునికి వీల్‌ఛైర్‌ను అందజేశారు. రాజానగరం మండలం ఫరిజల్లిపేటకు చెందిన 25 ఏళ్ల సిద్ధ శ్రీనివాస్ సుమారు ఐదు నెలల కిందట ద్విచక్రవాహనం నడుపుతూ రోడ్డు ప్రమాదానికి గురై మంచానికే పరిమితం అయ్యాడు. అతని భార్య ఐదు నెలల గర్భిణీతో సపర్యలు చేసినా ఫలితం లేకపోయింది. దీంతో బెడ్‌సోర్సు కారణంగా అతని శరీరం వెనుక భాగం పూర్తిగా దెబ్బతినే పరిస్థితి ఏర్పడింది. గత్యంతరం లేని ఈ పరిస్థితుల్లో శ్రీనివాస్ మెరుగైన వైద్యం కోసం రాజమహేంద్రవరం జీజీహెచ్‌లో చేరాడు. ఆసుపత్రిలో బాధితునికి వైద్య సేవలు అందిస్తున్న వైద్య సిబ్బంది కల్యాణి, భీమేశ్వరరావు ఆ యువకుని ఆవేదన చూసి చలించారు. బాధితుడిని ఆరు బయట తిప్పగలిగితే వీపుపై పుండ్లు మానుతాయని అతనికి వైద్యం చేసిన సర్జన్ డాక్టర్ హేమంతి చెప్పడంతో బాధితునికి తమ సొంత ఖర్చులతో వీల్‌ఛైర్ కొనుగోలు చేసి బాధితునికి వీల్‌ఛైర్ అందజేశారు. వైద్య సిబ్బంది కల్యాణి, భీమేశ్వరరావులను సూపరింటెండెంట్ అభినందించారు.



జడ్పీ హైస్కూల్ విద్యార్థులకు కిట్లను అందజేస్తున్న డాక్టర్ రవి కిరణ్


విద్యార్థులకు కిట్ల అందజేత

రాజమహేంద్రవరం రూరల్, జూలై 23: బొమ్మూరు జడ్పీ హైస్కూలులో మంగళవారం ప్రభుత్వం అందించిన 470 కిట్లను విద్యార్థులకు తెలుగుదేశం యువనాయకులు డాక్టర్ రవి రామ్‌కిరణ్ గోరంట్ల పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షుడు మన్యేటి ప్రసాద్, కామిని ప్రసాద్, రమేష్, పిల్లా తనూజ తదితరులు పాల్గొన్నారు.

ఎలక్ట్రికల్ వర్కర్స్ యూనియన్ సాయం

గోదావరి ఎలక్ట్రికల్ వర్కర్స్ ట్రేడ్ యూనియన్ మెంబర్ జె.పూర్ణచంద్రరావు మంగళవారం తాను పనిచేస్తుండగా కటింగ్ మిషన్ తగిలి కాలు విరిగింది. దీంతో యూనియన్ మెంబర్లు వచ్చి పరామర్శించి 25 కిలోల బియ్యం, ఒక నెల సరిపడా కిరాణా సరుకులు అందించారు. బొజ్జా రామకృష్ణ, కాకి రవిబాబు, వీరవల్లి గంగాచార్యులు పాల్గొన్నారు.





రైలు కూత వినపడలే!


- ఉమ్మడి జిల్లాలో పలు రైల్వే ప్రాజెక్టులు పెండింగ్
- ఏపీకి నిధులు ఇస్తామని నిర్మలమ్మ ప్రకటన
- జిల్లాల వారీగా కేటాయింపుల్లేవ్
- ఆశగా ఎదురుచూస్తున్న ప్రజానీకం
- ప్రాజెక్టులు వస్తాయంటున్న పురందేశ్వరి

(రాజమహేంద్రవరం/అమలాపురం/కాకినాడ-ఆంధ్రజ్యోతి)

కేంద్ర బడ్జెట్‌లో 'తూర్పు' రైలు కూత మోత మోగిందా? లేదా? అని గోదారోళ్లలో సంశయం పరుగులు పెడుతోంది. కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ మంగళవారం పార్లమెంట్‌కి సమర్పించిన బడ్జెట్‌లో ఏనాటి నుంచో కొట్టుమిట్టాడుతున్న రైల్వే ప్రాజెక్టుల ఊసే లేకపోవడంపై భిన్నవాదనలు వినిపిస్తున్నాయి. అయితే ఏపీలో రైల్వే ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డవలెప్‌మెంట్ ప్రాజెక్టులకు కేంద్ర ప్రభుత్వం అధిక నిధులు కేటాయిస్తుందని కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ చేసిన ప్రకటనతో ఆశలు చిగురిస్తున్నాయి. అన్నింటినీ కేంద్ర రైల్వే మంత్రికి విన్నవించామని.. దాదాపుగా అన్నీ సాకారమైనట్లేనని రాజమహేంద్రవరం ఎంపీ పురందేశ్వరి చెబుతున్నారు. ఇదిలా ఉండగా స్పష్టమైన ఆదేశాలకు ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా ప్రజలు ఎదురు చూస్తున్నారు. కొవ్వూరు-భద్రాచలం రోడ్ రైల్వే లైను ఎప్పటి నుంచో పెండింగ్‌లో ఉంది.నిడదవోలు జంక్షను అభివృద్ధిపై ఇంకా ఏ కబురూ లేదు. కోటిపల్లికి రైలు సదుపాయం ఎప్పటికో తెలియడం లేదు. రోడ్ కం రైలు బ్రిడ్జిపై రైళ్ల ట్రాఫిక్ పెరగడంతో ఆ వైబ్రేషన్స్‌కి రోడ్డు తరచుగా మరమ్మతులకు గురవుతోంది. దీంతో రైళ్లకు మూడో బ్రిడ్జి అవస రం ఏర్పడింది. రాజమండ్రిలో ఆర్చ్ బ్రిడ్జిపై మరో వంతెనను రూ.100కోట్లతో నిర్మిస్తామని చెప్పి ఏళ్లు గడుస్తున్నా అడుగు ముందడుగు పడలేదు. ఆర్చ్ బ్రిడ్జి నిర్మించినపుడే మరో వంతెన నిర్మాణానికి అనువుగా స్పాన్ల(స్తంభాలు) ను నిర్మించారు. అందువల్ల ట్రాక్ వేస్తే సరిపోతుంది.కానీ మూడో వంతెన దిశగా ఎలాంటి చర్యలూ లేవు. కొన్ని నెలల కిందట ప్రవేశపెట్టిన రైల్వే మధ్యంతర బడ్జెట్‌లో కోటిపల్లి-నర్సాపురం రైల్వే లైనుకు రూ.300 కోట్లను కేంద్రం కేటాయించింది. ఈసారి బడ్జెట్‌లో ప్రాజెక్టుకు నిధుల కేటాయింపుపై స్పష్టత లేదు. గౌతమి, వశిష్ఠ, వైనతేయ నదులపై నిర్మాణంలో ఉన్న రైల్వే వంతెనల పనులు ఎక్కడివక్కడే అసంపూర్తిగా నిలిచిపోయాయి. కేంద్రం ప్రకటించిన బడ్జెట్‌లో కాకినాడ-పిఠాపురం రైల్వేలైను నిర్మాణానికి కేటాయిం పులపై ఇంకా స్పష్టతరాలేదు. కాకినాడ నగరాన్ని విశాఖ-విజయవాడ మెయిన్ రైల్వేలైన్‌లోకి తీసుకువచ్చేందుకు గాను పిఠాపురం రైల్వేస్టేషన్ సమీపం నుంచి ప్రత్యేకంగా 21.5 కిలోమీటర్లు ఉండే రైలు మార్గాన్ని నిర్మించి కాకినాడను కలుపుకుంటూ సామర్లకోట రైల్వేలైను మార్గంలో కలపాలన్న ప్రతిపాదన ఉంది. దీనికి నిధుల కేటాయింపునకు కూటమి నేతలు, కాకినాడ ఎంపీ గట్టి ప్రయత్నాలే చేస్తున్నట్టు సమాచారం.దీనిపై కూడా స్పష్టమైన ప్రకటన లేదు. అమృత్ భారత్ పథకంలో రాజమండ్రి రైల్వే స్టేషను అభివృ ద్ధికి రూ.270 కోట్లు కేటాయించారు. రాజమండ్రిలో గోదావరి రైల్వే స్టేషను ప్రయాణికులకు అనుకూలంగా ఉంటుంది. ఇక్కడ ఒకటి, రెండు మినహా ఎక్స్‌ప్రెస్ రైళ్లు ఆగవు. అన్ని రైళ్లను నిలపాలని ప్రయాణికులు చాలా ఏళ్లగా కోరుతున్నారు. రాజమండ్రి రైల్వే స్టేషన్ గుండా రోజుకు సరాసరిన 30,336 మంది రాకపోకలు సాగిస్తున్నారు. రైలు ప్రయాణికులకు మాత్రం తిప్పలు తప్పడం లేదు.రాజమండ్రి నుంచి విశాఖ, విజయవాడ ఇంటర్‌సిటీ ఎక్స్‌ప్రెస్ లు నడపితే చాలామటుకు తిప్పలు తప్పుతాయి. నిడదవోలు-కాల్దరి మధ్యలో 9.75 కి.మీ మేర రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మాణానికి గెజిట్ నోటిఫికేషన్ విడుదలైంది. అంచనా వ్యయం.. పనులు ఎప్పుడు ప్రారంభమవుతాయనేది తెలియాల్సి ఉంది. ఉమ్మడి జిల్లాలో రైల్వే బడ్జెట్‌పై ఆశలు ఉన్నా.. ఎటూ తేలకపోవడంతో మీమాంస నెలకొంది. నిధుల విడుదలలో ఏపీకి ఏ లోటూ చేయమని నిర్మలమ్మ ప్రకటించడంతో ఆశలు రేకెత్తిస్తున్నాయి.

'పోల' వరమే

6





బడ్జెట్.. బాగు..బాగు

- మోదీ సర్కారు వరాల జల్లు
- కేంద్ర బడ్జెట్‌లో స్వల్ప తాయిలాలు
- కొత్త ఆదాయపు పన్ను శ్లాబుల సవరణ
- 32 వేల మంది ఉద్యోగులకు ఊరట
- విశాఖ-చెన్నై పారిశ్రామిక కారిడార్
- 5,544 కోట్లతో రెండు దశల్లో అభివృద్ధి
- కాకినాడ నోడ్‌కు బంగారు భవిష్యత్తు
- 2,145 మిలియన్ డాలర్ల పెట్టుబడికి ఛాన్స్
- ఉమ్మడి జిల్లాలో పదివేల ఎకరాల సేకరణ
- పారిశ్రామిక క్లస్టర్లకు అడుగులు
- కాకినాడ, రాజమండ్రి మధ్య అనుసంధానం
- ముద్ర రుణం రూ.20 లక్షలకు పెంపు
- ఫీడ్‌పై కస్టమ్స్ డ్యూటీ 5శాతం తగ్గింపు
- ఉమ్మడి జిల్లాలో ఆక్వాకు ఊపు

ఆశల పద్దు..అందరికీ అందేటట్టు

(కాకినాడ, ఆంధ్రజ్యోతి)

నిర్మలమ్మ పద్దు ఈసారి కరుణించింది. పేద, మధ్య తరగతి, ఉద్యోగ వర్గాలను ఊరించి.. ఊరించి నిరాశపరచడమే పనిగా కొన్నేళ్ల పాటు సాగిన బడ్జెట్ ఈసారి నిర్మలంగా మారింది. అన్ని వర్గాలకు ఎంతోకొంత ఉపశమనం కలిగించింది. ప్రతిసారీ రకరకాల వాతలు, వాయింపులతో జేబులు గుల్ల చేసిన బడ్జెట్ ఈసారి సామాన్యులు, ఉద్యోగుల జేబుల్లోంచి కాసులను ఎంతో కొంత మిగిల్చే నిర్ణయాలతో ఊరటనిచ్చింది. ఉద్యోగులు,పెన్షనర్లను పన్ను పోటు నుంచి కొంతవరకు తప్పించింది. విశాఖ-చెన్నై పారిశ్రామిక కారిడార్‌కు ప్రత్యేక సాయం అందిస్తామని ప్రకటించడంతో కాకినాడ నోడ్ బంగారు భవిష్యత్తుకు బాటలు వేసినట్లయింది. ఇది పరుగులు పెడితే ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో పారిశ్రామిక, ఆటోమొబైల్, టెక్స్‌టైల్, పెట్రోకెమికల్, పోర్టుల రూపురేఖలు మారడంతో పాటు పారిశ్రామిక పెట్టుబడులు పరుగులు తీయనున్నాయి. కాకినాడ-రాజమహేంద్రవరం నగరాల రూపురేఖలు మారడంతో పాటు పది వేల ఎకరాల్లో పారిశ్రామిక క్లస్టర్లు అభివృద్ధి చెందనున్నాయి.ఔత్సాహిక వ్యాపారులకు ముద్ర రుణాల పెంపుతో కేంద్ర బడ్జెట్ కొత్తబాటలు పరిచింది. రొయ్యలు, చేపల ఫీడ్‌పై కస్టమ్స్ డ్యూటీ 5 శాతం తగ్గింపుతో ఉమ్మడి జిల్లాలో సంక్షోభంలో ఉన్న ఆక్వారం గానికి కొంత తెరిపినిచ్చినట్లయింది. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో ఉద్యోగ, పెన్షనర్ వర్గాల్లో ఊరట నింపింది. ఉమ్మడి జిల్లాలో సచివాలయ ఉద్యోగులతో కలిపి 32వేల మంది వరకు ప్రభుత్వ ఉద్యోగులు ఉన్నారు. పెన్షనర్లు 45వేల మంది వరకు ఉన్నారు. వీరందరికీ తాజా బడ్జెట్‌తో కొంత మేలు జరగనుంది. కొత్తపన్ను విధానంలో కొన్ని మార్పులు చేయడం వీరికి కలిసిరానుంది. ఎప్పటిలాగే కొత్త పన్ను విధానంలో రూ.3లక్షల వరకు పన్ను లేదు. గతంలో రూ.3లక్షల నుంచి రూ.6లక్షల శ్లాబులో వార్షికా దాయం ఉన్న వారికి ఐదు శాతం పన్ను ఉండేది.కానీ ఇప్పుడు ఆ పరిమితిని రూ.7 లక్షలకు పెంచారు. వెరసి కేంద్ర బడ్జెట్ మెప్పించి అన్ని వర్గాలను మురిపించింది.

కాకినాడ నోడ్ కారిడార్‌తో వెలుగులే..

విశాఖ-చెన్నై పారిశ్రామిక కారిడార్‌కు ప్రత్యేక సాయం చేస్తామని బడ్జెట్‌లో కేంద్రం ప్రకటించడంతో కాకినాడ నోడ్ దశ తిరగనుంది. 800 కిలోమీటర్ల మేర విశాఖ నుంచి చెన్నై వరకు ప్రతిపాదించిన పారిశ్రామిక కారిడార్‌లో ఆంధ్రప్రదేశ్ పరిధిలో నాలుగు నోడ్‌లు ఉండగా, అందులో కాకినాడ నోడ్ ఒకటి. మొత్తం కారిడార్ కింద ఎక్కడికక్కడ ఆయా నోడ్‌ల్లో పోర్టులు, ఎయిర్‌పోర్టులు, హైవేలు, బీచ్‌లు, పారిశ్రామిక క్లస్టర్లను అనుసంధానం చేసి పారిశ్రామిక ప్రగతి భారీస్థాయిలో ఉండేలా ఈ కారిడార్‌ను ప్రతిపాదించారు. మొత్తం విశాఖ-చెన్నై పారిశ్రామిక కారిడార్‌ను రూ.5,544 కోట్లతో రెండు దశల్లో అభివృద్ధి చేయనున్నారు. ప్రస్తుతం తొలిదశ కింద రూ.2,278 కోట్లతో పనులు జరుగుతున్నాయి. రెండో దశలో రూ.2,599 కోట్లతో పనులకు ప్రణాళికలు రూపొందించారు.ఈ నేపథ్యంలో కాకినాడ నోడ్ కింద ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో 10వేల ఎకరాల్లో హార్డ్‌వేర్ తయారీ, టెక్స్‌టైల్, ఫుడ్ ప్రాసెసింగ్, ఆటోమొబైల్స్, ఫార్మా, మెడికల్ పరికరాలు, ఎలక్ట్రానిక్స్, ఏరోస్పేస్ తదితర రంగాలను ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో వివిధ క్లస్టర్ల కింద అభివృద్ధి చేస్తారు. కాకినాడలోని పోర్టులను రాజమహేంద్రవరం విమానాశ్రయానికి అనుసంధానిస్తారు. ఈ రెండు నగరాల మధ్య రోడ్డు, రైలు కనెక్టవిటీని పెంచుతారు. రాజమహేంద్రవరం విమానాశ్రయంలో కార్గో సేవలను అందుబాటులోకి తెస్తారు. గోదావరి, దాని పరిధిలోని కాలువలు, పీసీపీఐఆర్ ఎక్స్‌ప్రెస్ హైవేల నుంచి పరిశ్రమలకు అనుసంధానిస్తారు. కాకినాడ నోడ్ కింద ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో 2045కి 2,145 మిలియన్ డాలర్ల పెట్టుబడులు ఆశిస్తున్నారు. ప్రధానంగా కాకినాడ కారిడార్ కింద ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో పెట్రో కెమికల్, ఫార్మా రంగాలను భారీగా అభివృద్ధి చేస్తారు. ఉమ్మడి జిల్లాలో కాకినాడ నోడ్ కింద మామిడి జెల్లి క్లస్టర్లు 750 ఉన్నాయి. రైసుమిల్లులు, బ్రాన్ ఆయిల్ యూనిట్లు 550 ఉన్నాయి. వీటి వార్షిక టర్నోవర్ రూ.800 కోట్లు. వీటిని కూడా నోడ్ కింద క్లస్టర్ల తరహాలో అభివృద్ధి చేయనున్నారు.

ఔత్సాహికులకు ఆమోదముద్ర

వ్యాపార రంగంలో ఔత్సాహికులను ప్రోత్సహించేందుకు గతంలో కేంద్రం ప్రవేశపెట్టిన ముద్ర రుణాలను ఈ బడ్జెట్‌లో మరింత పెంచారు. రూ.10 లక్షల పెట్టుబడి రుణాన్ని రూ.20లక్షలకు పెంచారు. ఈ నేపథ్యంలో ఉమ్మడి జిల్లాలో వేలాది మంది యువతకు మేలు చేకూర నుంది. ఇకపై ఇంట్లో మైనర్ పిల్లల పేరు తోను తల్లిదండ్రులు పెట్టుబడులు పెట్టేలా కేంద్రం కొత్తగా బడ్జెట్‌లో ఎన్‌పీఎస్ వాత్సల్య పథకం ప్రవేశపెట్టింది. తద్వారా లక్షల కుటుంబాలకు ప్రయోజనం చేకూరనుంది. దేశీయ విద్యా సంస్థల్లో ఉన్నత విద్య అభ్యసించేందుకు రూ.10 లక్షల వరకు విద్యా రుణాలను కేంద్రం ప్రకటించింది. పట్టణాల్లో నివసించే ప్రజల సొంతింటి కలను నెరవేర్చేలా బడ్జెట్‌లో కేంద్రం పెద్దపీట వేసింది. ప్రధాని ఆవాస్ యోజన పథకానికి ఐదేళ్ల పాటు రూ.2.2 లక్షల కోట్ల సాయం ప్రతిపాదన చేయడంతో పాటు కోటి మంది గృహ అవసరాలు తీర్చేలా ఆర్థిక సాయం, వడ్డీ రాయితీ ప్రకటించింది. ఈ నేపథ్యంలో ఉమ్మడి జిల్లాలో కాకినాడ, రాజమహేంద్రవరం నగరాలకు వలస వచ్చి స్థిర నివాసం లేని వేలాది మందికి ప్రయోజనం చేకూరనుంది.

కంపెనీలకు పండగే...

పారిశ్రామిక రంగానికి ఊతమిచ్చేలా దేశీయ తయారీని ప్రోత్సహించేందుకు కేంద్రం అనేక కీలక నిర్ణయాలను బడ్జెట్‌లో ప్రకటించింది. అందులో భాగంగా కస్టమ్స్ డ్యూటీపై భారీ కోతలు విధించింది. దీనివల్ల ఎలక్ట్రానిక్, విలువైన లోహాలు, ఔషధాల ధరలు తగ్గనున్నాయి. ఉమ్మడి జిల్లాలో కాకినాడ, రాజమహేంద్రవరం, చుట్టుపక్కల అనేక ప్రాంతాల్లో నడుస్తున్న పలు ఫార్మా, ఇతర తయారీ యూనిట్లకు ఉత్పాదక వ్యయం తగ్గనుంది. ఆయా కంపెనీలకు ఆర్థిక భారం తగ్గనుంది. బంగారంపై బేసిక్ కస్టమ్ డ్యూటీని బడ్జెట్‌లో తగ్గించారు. పుత్తడి, వెండి వస్తువులపై కస్టమ్స్ డ్యూటీని ఆరు శాతానికి తగ్గించారు. గతంలో బంగారంపై చెల్లించే పన్ను 11 శాతం, అగ్రి సెస్‌తో కలిసి మొత్తం 15 శాతం ఉండేది. తాజా సవరణతో మొత్తం బంగారంపై పన్ను 11 శాతమే ఉండనుంది. దీని ప్రభావంతో మంగళవారం గ్రాము బంగారంపై ధర రూ.250కిపైగా పడింది. ఈ నేపథ్యంలో కొనుగోళ్లు ఊపందుకోనున్నాయి. తద్వారా రాష్ట్ర ప్రభుత్వానికి జీఎస్టీ వసూళ్లు కోట్లలో పెరగనున్నాయి. క్యాన్సర్ రోగులకు ఊరటనిచ్చేలా మరో మూడు కీలక ఔషధాలపై కస్టమ్స్ డ్యూటీ పూర్తిగా తొలగించారు. దీంతో జిల్లాలో వందలాది మంది క్యాన్సర్ రోగులకు ఆర్థిక భారం తొలగనుంది. మహిళల పేరిట కొనుగోలు చేసే ఆస్తులపై సుంకాన్ని మరింత తగ్గించేలా దృష్టిపెడతామని ఆర్థిక మంత్రి ప్రకటించడంతో అతివలకు కీలక ప్రాధాన్యం ఇచ్చినట్లయింది. స్థిరాస్తులపై ఏవిధంగా దీనికి సంబంధించిన విధివిధానాలు ఉంటాయనేదానిపై స్పష్టత రావాల్సి ఉంది.

ఏపీ అభివృద్ధి బడ్జెట్ ఇది..



ఏపీ అభివృద్ధి బడ్జెట్ ఇది.. ప్రాజెక్టులకు, కారిడార్‌లకు నిధులు కేటాయించారు. ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రకటించిన బడ్జెట్ అన్ని వర్గాలకు అండగా ఉంది. కేంద్రం కొవిడ్ కాలంలో కొవ్వూరు రైల్వేస్టేషన్‌లో రద్దయిన రైళ్లను వీలైనంత త్వరగా పునరుద్ధరించాలని కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్‌ను కోరాను.

- దగ్గుబాటి పురందేశ్వరి, రాజమహేంద్రవరం ఎంపీ

రాజధానికి 15 వేల కోట్లు



అమరావతి రాజధాని నిర్మాణానికి రూ.15 వేల కోట్లను అదనంగా బడ్జెట్‌లో కేటాయించడం రాష్ట్ర ప్రగతికి శుభపరిణామం. రాజధానితో పాటు పోలవరం ప్రాజెక్టు నిర్మాణానికి నిధుల కేటాయింపుపై కేంద్రం భరోసా ఇవ్వడంతో అడ్డంకులు తొలగాయి. రాష్ట్రంలో మరిన్ని ప్రాజెక్టులకు, కారిడార్‌లకు నిధులు కేటాయించారు.

- గంటి హరీష్‌మాధుర్, అమలాపురం ఎంపీ

ఆశాజనకంగా ఉంది



కేంద్ర బడ్జెట్ ఆశాజనకం. పోలవరం ప్రాజెక్టును త్వరితగతిన పూర్తి చేసేందుకు హామీ ఇవ్వడం, వెనుకబడిన రాయల సీమ, ప్రకాశం, ఉత్తరాంధ్ర జిల్లాల అభివృద్ధికి ప్రత్యేక ప్యాకేజీ ప్రకటించడం హర్షణీయం. పూర్వోదయ పథకం ద్వారా ఏపీకి కొత్త ప్రాజెక్టులు ప్రకటించడం ద్వారా పారిశ్రామిక అభివృద్ధికి ఆస్కారం ఏర్పడుతుంది.

- తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్, కాకినాడ ఎంపీ

ఆక్వాకు ఊపే..

ఉమ్మడి తూ.గో. జిల్లాలో కాకినాడ, కోనసీమ జిల్లాల్లో ఆక్వా రంగం భారీగా విస్తరించి ఉంది. 58వేల ఎకరాల్లో 23వేలకుపైగా హేచరీలు నడుస్తున్నాయి. అటు వేలాది ఎకరాల్లో చేపల చెరువులు ఉన్నాయి. గడచిన మూడేళ్లలో ఫీడ్ ధరలు ఆకాశాన్నంటాయి. దీంతో పెట్టుబడి వ్యయం తీవ్రంగా పెరిగిపోయింది. ఏటా ఉమ్మడి తూ.గో.జిల్లా నుంచి కోట్లలో ఒక్క రొయ్యల ఫీడ్ కోసమే ఆక్వా రైతులు ఖర్చు చేస్తున్నారు. అదే సమయంలో అంతర్జాతీయ మార్కెట్‌లో ధరలు పడిపోవడంతో ఎగుమతులు నిలిచిపోయాయి. దీంతో ఈ రంగం ప్రస్తుతం సంక్షోభంలో ఉంది. ఈ తరుణంలో కేంద్ర బడ్జెట్ ఆక్వా రంగానికి భారీ ఉపశమనం కలిగించింది. రొయ్యలు, చేపల ఫీడ్‌పై కస్టమ్స్ డ్యూటీ ఐదు శాతం తగ్గించింది. దీంతో రొయ్యలు, చేపల ఫీడ్ ధరలు భారీగా తగ్గనున్నాయి. ఈ నేపథ్యంలో తిరిగి ఈ రంగం కొంత కోలుకునే అవకాశం ఏర్పడింది.





ఉరుకులు.. పరుగులు : ధవళేశ్వరం వద్ద గోదావరి ఉధృతి

ఉప్పొంగినది!

రాజమహేంద్రవరం, జూలై 23 (ఆంధ్రజ్యోతి)/కొవ్వూరు :అఖండ గోదావరి మహోగ్రరూపం దాల్చింది. ఎగువన భద్రాచలం, దిగువన ధవళేశ్వరం బ్యారేజ్‌ల వద్ద రెండు ప్రమాద హెచ్చరికలు జారీ చేయడంతో తీర ప్రాంత ప్రజలకు కంటి మీద కునుకు లేకుండా పోయింది.భద్రాచలం వద్ద గోదావరి వరద తగ్గుముఖం పట్టడంతో ధవళేశ్వరం బ్యారేజీ వద్ద వరద ప్రవాహం పెరుగుతోంది. బ్యారేజీ వద్ద మంగళవారం తెల్లవారుజామున 2 గంటలకు రెండో ప్రమాద హెచ్చరిక జారీ చేశారు. రాత్రి 11 గంటలకు బ్యారేజీ నీటి మట్టం 14.80 అడుగులకు చేరింది. పాండ్ లెవల్ 15.18 మీటర్లుగా ఉంది. బ్యారేజి నుంచి సముద్రంలోకి 14,36,472 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. భద్రాచలం వద్ద 49.90 అడుగులకు నీటిమట్టం తగ్గింది..

- ధవళేశ్వరం వద్ద రెండో ప్రమాద హెచ్చరిక
- 14,36,472 క్యూసెక్కులు విడుదల
- 18.80 అడుగులకు నీటిమట్టం
- నీట మునుగుతున్న లంకలు
- పునరావాస కేంద్రాలకు తరలింపు
- భద్రాచలం వద్ద తగ్గుముఖం
- నీట మునిగిన కొవ్వూరు గోష్పాదక్షేత్రం



గోష్పాదక్షేత్రంలో గోదావరి వరద



కడియపులంకలో నీట మునిగిన మొక్కలు

భద్రాచలం నుంచి ధవళేశ్వరం బ్యారేజ్‌కు వరద ప్రవాహం చేరుకోవడానికి సుమారు 18 గంటలు సమయం పడుతుందని గోదావరి హెడ్‌వాటర్ వర్క్సు అధికారుల అంచనా వేస్తున్నారు. ఈ నేపథ్యంలో బ్యారేజీ వద్ద రెండో ప్రమాద హెచ్చరిక బుధవారం కూడా కొనసాగుతోంది. ఇప్పటికే రాజమహేంద్రవరం, కొవ్వూరు డివిజన్ల మధ్య అఖండ గోదావరి సముద్రంలా మారింది. కొవ్వూరు గోష్పాదక్షేత్రం నీట మునిగింది. ఆలయాలన్నీ నీట మునిగాయి. క్షేత్రంలోకి ఎవ్వరూ రాకుండా కొవ్వూరు డీఎస్పీ కె. శ్రీనివాసమూర్తి ఆధ్వర్యంలో పట్టణ సీఐ వి.జగదీశ్వరరావు పోలీసు పికెటింగ్ ఏర్పాటుచేశారు. గోదావరి వరద ప్రభావంతో రాజమహేంద్రవరం పరిధి లోని లంకలన్నీ మునిగిపోతున్నాయి. ఇప్పటికే బ్రిడ్జిలంక, కేతావారిలంక, ఎదుర్లమ్మలంక వంటివి మునిగిపోవడంతో 248 మందిని రాజమహేంద్రవరంలోని పునరావాస కేంద్రాలకు తరలించారు. ఆల్‌కట్ గార్డెన్స్‌లోని మునిసిపల్ కల్యాణ మండపంలో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాన్ని మంగళవారం కలెక్టర్ పరిశీలించి సదుపాయాలపై ఆరా తీశారు.

వరదలోనే ఉంటాం..

సీతానగరం మండలంలోని ముల్లకలంక నుంచి ప్రజలు బయటకు రావడంలేదు. సుమారు 1000 మంది వరకూ జనం ఉన్నారు. 320 ఇళ్లు ఉన్నాయి. 850 వరకూ గేదెలు, ఆవులు ఉన్నాయి.ఇక్కడ పాల వ్యాపారులే ఎక్కువ. వారెవరూ బయటకు రావడంలేదు. జనం వచ్చితమ పనులు చూసుకుని తిరిగి లంకల్లోకి వెళ్లేందుకు గోదావరిలో రెండు పడవలు ఏర్పాటు చేశారు.ఆర్ఐ లక్ష్మీదేవి ఆధ్వర్యంలో క్యాంపు ఏర్పాటు చేశారు.కొవ్వూరు రూరల్ మద్దూరు లంక నుంచి వరద బాధితులు పునరావాస కేంద్రాలకు రావడం లేదు. అధికారులు తరలించేందుకు ప్రయత్నిస్తున్నారు. ఎర్రకాలువ వరద కారణంగా నల్ల జర్లనిడదవోలు మండలాల్లో పునరావాస కేంద్రాలు కొనసాగుతున్నాయి. ఎర్రకాల్వ తగ్గుముఖం పట్టడంతో ఖాళీ చేసి వెళ్లిపోయారు.

రేవుల్లో దిగితే కేసులే..

రాజమహేంద్రవరం సిటీ, జూలై 23: గోదావరి ఉధృతంగా ఉన్నందున రాజమహేంద్రవరంలో అన్ని స్నానాల రేవులను నగరపాలక సంస్థ అధికారులు మూసివేశారు. కోటిలింగాలరేవు. చింతాలమ్మఘాట్, పుష్కరాలరేవు, టీటీడీ ఘాట్, శ్రద్ధానందాఘాట్, లాంచీల రేవు, గౌతమి ఘాట్, సరస్వతి ఘాట్‌లను మూసివేశారు. అక్కడ రేవులలో గోదావరిని చూసేందుకు వీలులేకుండా గేట్లను మూసివేసి సిబ్బందిని ఏర్పాటు చేశారు. పలు ఘాట్ల వద్ద కర్రలతో లోపలకు ఎవరూ వెళ్లకుండా ఏర్పాట్లు చేశారు.ఎవరైనా రేవుల్లో దిగితే కేసులు పెడతామని హెచ్చరిస్తున్నారు.



ఆర్యాపురం అర్బన్ బ్యాంకులో సమావేశమైన నూతన పాలకవర్గం

అర్బన్ బ్యాంక్ చైర్మన్‌గా చల్లా శంకరరావు
వైస్‌చైర్మన్‌గా పోలాకి పరమేశ్వరరావు

రాజమహేంద్రవరం, జూలై23(ఆంధ్రజ్యోతి) : ఆర్యాపురం అర్బన్ బ్యాంక్ పాలకవర్గం మంగళవారం బాధ్యతలు స్వీకరించింది. తెలుగుదేశం-జనసేన-బీజేపీ కూటమికి చెందిన చల్లా శంకరరావు చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించారు.ఆయన చైర్మన్‌గా రెండోసారి ఎన్నికయ్యారు. మొత్తం 12 మంది డైరెక్టర్లు కూటమికి చెందిన వారే కావడంతో వారంతా చల్లాను చైర్మన్‌గా ఎన్నుకున్నారు. పోలాకి పరమేశ్వరరావును వైస్ చైర్మన్‌గా ఎన్నుకున్నారు. డెరెక్టర్లుగా కప్పల సూర్యప్రకాశరావు, పడాల శ్రీనివాసరావు, పిల్లి శ్యామ్ కుమార్, యర్రమోతు ధర్మరాజు, బుడ్డిగ రవి కొండలరావు, యాళ్ల వెంకట్రావు, ముగిది శ్రీనివాసరావు , యెనుమల రంగారావు, సింగంపల్లి రంగారావు,నీలపాల సూర్య సత్యనారాయణ బాధ్యతలు స్వీకరించారు. పాలకవర్గాన్ని మాజీ ఎమ్మెల్సీ ఆదిరెడ్డి అప్పారావు,జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి అనుశ్రీ సత్యనారా యణ అభినందించారు. బ్యాంక్‌ను అభివృద్ధి పథంలో నడిపిస్తామని చైర్మన్ శంకరరావు, పాలకవర్గ సభ్యులు ప్రకటించారు.

బ్యాంకర్లతో కలెక్టర్ సమీక్ష

రాజమహేంద్రవరం రూరల్, జూలై 23: అల్పాదాయ వర్గాలు, స్వయం సహాయక సంఘాలు, ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు, కౌలు రైతులకు రుణాల మంజూరులో బ్యాంకర్లు ఉదారతతో వ్యవహరించాలని కలెక్టర్ పి.ప్రశాంతి అన్నారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో బ్యాంకర్లతో సమీక్షించారు. 2023-24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి 3,4వ త్రైమాసికాల వార్షిక ప్రణాళికల అమలు పురోగతి, ప్రాధాన్యత అంశాలు, అల్పాదాయ వర్గాల ఆర్థిక చేకూర్పు, వ్యవసాయ అనుబంధ రంగాల రుణ ప్రణాళిక ప్రగతి, ఎస్‌హెచ్‌జీ, బ్యాక్ లింకేజీ, వికసిత భారత్, విశ్వకర్మ యోజన, కేంద్ర ప్రభుత్వ పథకాలకు బ్యాంకు రుణాలు తదితర అంశాలపై చర్చించారు. సీసీఆర్సీ కార్డులు పొందిన కౌలు రైతులకు రుణాలు మంజూరు చేయాలన్నారు. బ్యాంకర్లు విధిగా ఆర్థిక అక్షరాస్యత డిజిటల్ లిటరసీ కార్యక్రమాలు నిర్వహిస్తూ నగదు రహిత లావాదేవీలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలు, గృహ ఆధారిత రంగాల్లో నైపుణ్యశిక్షణ కార్యక్రమాలు నిర్వహించాలన్నారు ఎంఎస్ఎంఈ రంగం అభివృద్ధిలో భాగంగా చిన్న, మధ్య తరహా పరిశ్రమల తోడ్పాటుకు బ్యాంకర్లు ఆర్థిక ప్రోత్సాహాన్ని అందించాలన్నారు. ప్రధానమంత్రి స్వనిధి పథకం అమలులో రాష్ట్రంలోనే మొదటి స్థానంలో నిలవడం జరిగిందన్నారు. కేంద్ర ప్రభుత్వం ధ్రువీకరించిన ధ్రువపత్రాన్ని కలెక్టర్ ప్రశాంతి ఎల్‌డీఎం డీవీ ప్రసాద్‌కు అందజేశారు. కార్యక్రమంలో ఎల్‌డీవో నాగ ప్రవీణ్, నాబార్డ్ ఏజీఎం స్వామి నాయుడు, బ్యాంకు కన్వీనర్లు తదితరులు పాల్గొన్నారు.

మంత్రి ఆదేశించారు.. కలెక్టర్ స్పందించారు

కానూరు మురుగు డ్రెయిన్‌లో పూడికతీత పనులు





కానూరులో పూడికతీత పనులను పరిశీలిస్తున్న కలెక్టర్ ప్రశాంతి, ఉండ్రాజవరం మండలం సూర్యారావుపాలెంలో పర్యటిస్తున్న దృశ్యం

పెరవలి, జూలై 23: కానూరు ప్రాంతంలో సుమారు వెయ్యి ఎకరాలకు పైగా నాలుగైదు రోజులుగా నీటిలో మునిగి ఉండడంతో రైతుల ఆందోళన గురించి తెలుసుకున్న మంత్రి దుర్గేష్ సోమవారం రాత్రి కానూరు వచ్చి పరిస్థితిని పరిశీలించారు. ఈ మేరకు ఆయన ఇచ్చిన ఆదేశాలు మేరకు స్పందించిన కలెక్టర్ ప్రశాంతి మంగళవారం మధ్యాహ్నం కానూరు వచ్చారు. ఇక్కడ వర్షపు నీరు బయటకు పోయేందుకు వీలుగా మురుగు డ్రెయిన్ పూడికను వెంటనే తొలగించాలని స్థానిక అధికారులను ఆదేశించారు. ఎక్కడైనా ఆక్రమణలు ఉంటే వెంటనే తొలగించాలని యుద్ధ ప్రాతిపదికన పనులు పూర్తి చేసి వరి పొలాల్లో నీరు బయటకు పోయేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. దీంతో కదిలిన స్థానిక అధికారులు రంగంలోకి దిగి డ్రెయిన్‌ల పూడిక తీత పనులు ప్రారంభించారు. దీంతో స్థానిక రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. కార్యక్రమంలో తహశీల్దార్ సుధ, ఎంపీడీవో హిమమహేశ్వరి, ఇరిగేషన్ అధికారులు పాల్గొన్నారు.

పొలాల్లో నీరు లేకుండా చర్యలు చేపట్టాలి

ఉండ్రాజవరం, జూలై 23: వరద ముంపుకు గురైన పొలాల్లో నీరు లేకుండా చర్యలు చేపట్టాలని కలెక్టర్ పి.ప్రశాంతి పేర్కొన్నారు. మంగళవారం ఎర్రకాలువ ముంపుకు గురైన కాల్ధరి, పసలపూడి, సూర్యారావుపాలెం గ్రామాల్లో పంట పొలాలను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులు, అధికారులతో ఆమె మాట్లాడారు. భవిష్యత్తులో ముంపు నివారణ, దీర్ఘకాలిక రక్షణ చర్యల కోసం ప్రతిపాదనలు తయారు చేయాలని అధికారులను ఆదేశించారు. పంట నష్ట వివరాలు సేకరించాలన్నారు. ఈ మూడు గ్రామాల్లో ప్రాథమిక అంచనా ప్రకారం సుమారు 5వేల ఎకరాలు ముంపుకు గురైనట్టు ఆమె తెలిపారు. కాలువల్లో పూడిక తీత పనులు చేపట్టి గట్టు పటిష్టతకు చర్యలు తీసుకోవాలన్నారు. డ్రెయిన్లలో గుర్రపు డెక్క తొలగింపు తీరును ఆమె పరిశీలించారు. రైతులతో మాట్లాడగా పలు విషయాలు ఆమె దృష్టికి తీసుకువచ్చారు. కార్యక్రమంలో సబ్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాత్సవ్, ఎంపీడీవో కె.నరేంద్రరెడ్డి, తహసిల్దార్ కె.నవీన్‌కుమార్, వ్యవసాయాధికారి ఎం.విశ్వాసరావు, కాల్ధరి సర్పంచ్ చీపుళ్ల కుమారి, నాయకులు ఈర్పిన సత్యనారాయణ, నందిన శ్రీనివాసు, కె.శ్రీనివాస్ పాల్గొన్నారు.

పశువులకు వ్యాక్సిన్ వేయించాలి

పశు సంవర్ధక శాఖ డీడీ రాధాకృష్ణ

పెరవలి, జూలై 23: వరదల సమయంలో పాముల నుంచి పశువులను జాగ్రత్తగా కాపాడుకోవాలని పశు సంవర్ధక శాఖ డీడీ రాధాకృష్ణ పేర్కొన్నారు. స్థానిక పశువుల రైతులకు అవగాహన కల్పించేందుకు మంగళవారం ఖండవల్లి వచ్చారు. ఈ సందర్భంగా గోదావరి లంక భూముల్లో ఎక్కువ మంది పశువులు మేపుతూ ఉంటారని వాటిని వెంటనే ఏటిగట్టుపైకి తరలించాలన్నారు. వారం రోజులుగా కురుస్తున్న వర్షాలు వల్ల గోదావరి ఉధృతి పెరిగిందని పశువులకు వ్యాక్సిన్ వేయించాలని, దీంతో గొంతు వాపు, జబ్బవాపు నివారించుకోవచ్చునని చెప్పారు. కార్యక్రమంలో స్థానిక వైద్యులు చరన్ ఫణీంద్ర, వెటర్నరీ అసిస్టెంట్ డైరెక్టర్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



మద్దూరులంకలో వరదను పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్ శ్రీవాస్తవ



కొవ్వూరు గోష్పాదక్షేత్రంలో ఆలయాల చుట్టూ చేరిన వరద



మద్దూరులో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రం

మద్దురులంకలో ఏటిగట్టును ఇసుక బస్తాలతో పటిష్ట పరుస్తున్న సిబ్బంది

ఇల్లు విడిచి రాలేం!

పునరావాస కేంద్రానికి వచ్చేందుకు మద్దూరులంక వాసుల విముఖత

- లోతట్టు ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలి
- కొవ్వూరు సబ్ కలెక్టర్ ఆశుతోష్ శ్రీవాస్తవ
- గ్రామంలో ప్రత్యేక పారిశుధ్య పనులు

కొవ్వూరు, జూలై 23: ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలతో గోదావరి ఉధృతంగా ప్రవహిస్తుండడంతో లోతట్టు ప్రాంతాల్లో నివసిస్తున్న ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కొవ్వూరు సబ్ కలెక్టర్ ఆశుతోష్ శ్రీవ్తావ అన్నారు. మంగళవారం కొవ్వూరు మండలం మద్దూరులంక, పల్లిపాలెం గ్రామాల్లో గోదావరి వరద పరిస్థితిని పరిశీలించారు. ఏటిగట్లను పరిశీలించి, ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని పంచాయతీ కార్యదర్శులకు, వీఆర్వోలకు ఆదేశాలిచ్చారు. గోదావరికి ఎగువ నుంచి వరద ప్రవాహం అధికంగా వచ్చి చేరడంతో మద్దూరులంక, పల్లిపాలెం గ్రామాల్లో ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. మద్దూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటుచేసిన పునరావాస కేంద్రానికి వచ్చి అధికారులకు సహకరించాలన్నారు. వరద మరో 2 అడుగులు పెరిగితే తామే స్వయంగా పునరావాస కేంద్రానికి వస్తామ పల్లిపాలెంలో నివసిస్తున్న 20 కుటుంబాలకు చెందిన 48 మంది అన్నారు. కాగా ముంపు గ్రామాల్లో ఎవరైనా గర్భిణులు ఉంటే సురక్షితంగా బంధువుల ఇంటికి పంపించాలని, వరద ఉధృతి అధికంగా ఉన్నందున మత్స్యకారులు వేటకు నదిలోకి వెళ్లరాదని, లంక గ్రామాల్లో ఎవరైన ఉంటే వెంటనే బయటకు రావాలని టాంటాం ద్వారా ప్రజలను హెచ్చరించారు.

● తహశీల్దార్ కె.మస్తాన్ మాట్లాడుతూ గోదావరిలో వరద ప్రవాహం అధికంగా ఉన్నందున తీర ప్రాంతాల్లోని స్నానఘట్టాల వద్ద ప్రత్యేక బృందాలను ఏర్పాటుచేసి ఎప్పటికప్పుడు పరిస్థితిని తెలుసుకుంటున్నామన్నారు. ఆరికిరేవుల, కుమారదేవం, చిడిపి, ఔరంగాబాద్, వాడపల్లి, బంగారమ్మపేట, మద్దూరు, మద్దూరులంక, కొవ్వూరు పట్టణంలోని గోష్పాదక్షేత్రంలో మూడు షిఫ్ట్‌ల్లో వరద ఉధృతిని పర్యవేక్షిస్తున్నామన్నారు. సచివాలయ కార్యదర్శులు, రెవెన్యూ సిబ్బందితో ప్రత్యేక బృందాలను ఘాట్‌ల వద్ద ఏర్పాటు చేశామన్నారు. వరద కారణంగా ఎటువంటి ప్రమాదాలు జరిగినా, అత్యవసర పరిస్థితులు ఎదురైనా, పంట, ఆస్తి, ప్రాణ నష్టం సంభవించినా తహశీల్దార్, ఆర్డీవో కార్యాలయాలకు సమాచారం అందజేయాలని తహశీల్దార్ చెప్పారు.

● పంచాయతీ కార్యదర్శి వెంకటరమణ మాట్లాడుతూ మద్దూరులంక, పల్లిపాలెం గ్రామాల్లో వరదను దృష్టిలో పెట్టుకుని ముందస్తు జాగ్రత్త చర్యగా వైద్య బృందాలు ఇంటింటికి వెళ్లి ప్రజలకు ఆరోగ్య పరీక్షలు నిర్వహిస్తున్నారన్నారు. ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు గ్రామంలోని బోర్లు, వాటర్‌ట్యాంకుల్లో ఉన్న తాగునీటికి నాణ్యత పరీక్షలు నిర్వహించారన్నారు. పారిశుధ్య సమస్యలు తలెత్తకుండా గ్రామంలో ప్రత్యేక పారిశుధ్య పనులు చేపట్టి ఎటువంటి అంటువ్యాధులు ప్రబలకుండా బ్లీచింగ్ చల్లుతున్నామన్నారు. ఈ సందర్భంగా సబ్ కలెక్టర్ వెంట ఆర్ఐ బి.విశ్వేశ్వరరావు, ఎంపీడీవో కె.సుశీల, ఈఆర్వోలు, ఆశా, అంగన్వాడీ వర్కర్లు ఉన్నారు.



పెరవలి: తీపర్రులో పుష్కర రేవు వద్ద శివుని పీఠాన్ని తాకిన గోదావరి



పెరవలి: ఖండవల్లిలో రైతులతో మాట్లాడుతున్న డీడీ రాధాకృష్ణ

పునరావాస కేంద్రాలకు తరలించండి

జిల్లా జాయింట్ కలెక్టర్ తేజ్‌భరత్

కొవ్వూరు, జూలై 23: గోదావరి వరద క్రమక్రమంగా పెరుగుతున్నందున ముంపు గ్రామాల ప్రజలను పునరావాస కేంద్రాలకు తరలించాలని జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్.తేజ్‌భరత్ అధికారులను ఆదేశించారు. మంగళవారం కొవ్వూరు మండలం మద్దూరులంక గ్రామంలో బలహీనంగా ఉన్న ఏటిగట్టును ఇసుకబస్తాలతో పటిష్టపరిచారు. జేసీ తేజ్‌భరత్, వరద ప్రత్యేకాధికారి, టూరిజం శాఖ డిప్యూటీ కలెక్టర్ స్వామినాయుడు పర్యవేక్షించారు. జేసీ మాట్లాడుతూ ప్రస్తుతం ధవళేశ్వరం కాటన్ బ్యారేజ్ వద్ద రెండో ప్ర మాద హెచ్చరిక దాటి గోదావరి ఉధృతంగా ప్రవహిస్తోందన్నారు. గోదావరి పరివాహక ప్రాంతాల ప్రజలు, అధికారులు అప్రమత్తమై, ఎటువంటి ఇబ్బం దులు ఎదురైనా పునరావాస కేంద్రాలకు తీసుకురావాలన్నారు. వరద ప్రవా హం మరింత పెరిగే అవకాశం ఉన్నందున మద్దూరులంక గ్రామంలో ఏటిగట్టు పటిష్టతకు వేసిన ఇసుక బస్తాలను పరిశీలించారు. గ్రామాల్లో అంటువ్యాధులు ప్రబలకుండా తాత్కాలిక వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి అత్యవసర మందులు అందుబాటులో ఉంచామని జేసీ తేజ్‌భరత్ చెప్పారు.



మద్దూరులంకలో వరద పరిస్థితిని పరిశీలిస్తున్న జేసీ తేజ్‌భరత్

కమ్యూనిటీ నారుమళ్లు వేసుకోండి

వ్యవసాయ వర్సిటీ పరిశోధన సంచాలకుడు సత్యనారాయణ



కంసాలిపాలెంలో నీట మునిగిన పొలాలను పరిశీలిస్తున్న వ్యవసాయ శాస్త్రవేత్తలు

నిడదవోలు, జూలై 23: ఎర్రకాలువ వరద ముంపునకు గురైన రైతులు మెరకలో కమ్యూనిటీ నారుమళ్లు వేసుకుంటే ఉపయుక్తంగా ఉంటుందని వ్యవసాయ వర్సిటీ పరిశోధన సంచాలకుడు పీవీ సత్యనారాయణ అన్నారు. మంగళవారం నిడదవోలు మండలం రావిమెట్ల, తిమ్మరాజుపాలెం, కంసాలిపాలెం గ్రామాల్లో వరద ముంపుకు గురైన పంట పొలాలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వరద ముంపుకు గురైన నష్టాన్ని రైతులు కుదించుకోవడం ఎంతైనా అవసరమని అటువంటి పొలాల్లో స్వర్ణ సంపద, స్వర్ణ వంటి సన్న రకాలను నారుమళ్లుగా వేసుకోవాలన్నారు. తద్వారా డిసెంబరు నెలలోపు పంట చేతికి వచ్చే అవకాశం ఉందన్నారు. లోతట్టు ప్రాంత రైతులకు మెరక ప్రాంత రైతులు నారు ఇచ్చి సహకరించాలన్నారు. ఈ సందరర్భంగా ఆయన వెంట ఏడీఆర్ డాక్టర్ టి.శ్రీనివాస్, జిల్లా ఏరువాక కేంద్రం కో ఆర్డినేటర్ చల్లా వెంకట నరసింహారావు, ఎస్.మాధవరావు, చంద్రశేఖర్, జి.సత్యనారాయణ, మార్టేరు వ్యవసాయ శాస్త్రవేత్తలు ఉన్నారు.

ట్రిపుల్ ఐటీకి దేవరపల్లి విద్యార్థి ఎంపిక

దేవరపల్లి, జూలై 23: దేవరపల్లికి చెందిన మిరియాల వెంకట్ ట్రిపుల్ ఐటీకి ఎంపికవ్వడంతో ఉపాధ్యా యులు మంగళ వారం అభినందించారు. స్థానిక జడ్పీ హైస్కూల్లో 2023 -24 విద్యాసంవత్సరం పదో తరగతి పరీక్షల్లో వెంకట్ 600 మార్కులకు 575 సాధించి మండలంలోనే ప్రథమ స్థానం సాధించాడు. ఇటీవల ప్రకటించిన ట్రిపుల్ ఐటీకి ఎంపికై శ్రీకాకుళంలో సీటు పొందాడు. ఈ సందర్భంగా విద్యార్థిని ప్రధానోపా ధ్యాయురాలు శ్రీలక్ష్మి, ఎంఈవోలు ఎం.తిరుమల దాసు, అప్పారావు, పలువురు ఉపాధ్యాయులు అభినందించారు.

ఉచిత కంప్యూటర్ శిక్షణ

గోపాలపురం, జూలై 23: ఏపీ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో (స్కిల్‌హబ్) కంప్యూటర్ కోర్సుల్లో శిక్షణకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్టు ఎంపీడీవో రమేష్ ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్, ఆపై చదివిన వారై ఉండి ఆసక్తి ఉన్న యువతీయువకులు దరఖాస్తు చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు 84999 43366 నెంబర్‌ను సంప్రదించాలని పేర్కొన్నారు.

ఆజాద్, తిలక్ జయంతి

తాళ్లపూడి, జూలై 23 భారత జాతీయోద్యమ పిత బాల గంగాధర్ తిలక్, స్వాతంత్ర సమర యోధుడు ఆజాద్ చంద్రశేఖర్‌ల జయంతిని రాగోలపల్లి ప్రాథమిక పాఠశాలలో నిర్వహించారు. హెచ్‌ఎం దుర్గారావు తిలక్, ఆజాద్ చిత్ర పటాలకు నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 1856 జూలై 23న మహారాష్ట్రలోని రత్నగిరిలో జన్మించిన తిలక్ స్వరాజ్యం నా జన్మ హక్కు, దానిని సాధించి తీరుతానని ప్రకటించి స్వాతంత్ర్య ఉద్యమం చేశారన్నారు. వితంతు వివాహాలను స్వాగతించారన్నారు. ఆజాద్ 13 ఏళ్ల వయస్సులో స్వాతంత్ర్య పోరాటంలో పోలీసులకు చిక్కి తనను తాను కాల్చుకుని ఆత్మార్పణ చేసుకున్న మహనీయుడని చెప్పారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యం



పెరవలి, జూలై 23: మండలంలోని కాకరపర్రు గ్రామ పరిధిలోని నర్సాపురం కాలువలో సుమారు 35నుంచి 40 ఏళ్ల వయసున్న గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం కొట్టుకువచ్చింది. మృతుడి ఒంటిపై చుక్కల పువ్వుల డిజైన్ ఉన్న లేత నీలం రంగు చొక్కా, ముదురు గోధుమ రంగు డ్రాయర్ ఉన్నాయని, మృతుడు ఎత్తు సుమారు 5.7 అడుగులు ఉండి లావుగా ఉన్నాడని, అతడి వివరాలు తెలిసిన వారు 94407 96642 నెంబరుకు సమాచారం తెలియజేయాలని పోలీసులు పేర్కొన్నారు. మృతదేహాన్ని తణుకు ప్రభుత్వాసుపత్రిలోని మార్చురీకి తరలించినట్టు చెప్పారు.

క్వారీల్లో రిగ్ బ్లాస్టింగ్ నిలిపి వేయాలి

దుద్దుకూరులో గ్రామస్థుల నిరసన.. రాస్తారోకో



దుద్దుకూరులో రహదారిపై నిరసన తెలుపుతున్న గ్రామస్థులు

దేవరపల్లి, జూలై 23: క్వారీ రిగ్‌బ్లాస్టింగ్ వల్ల ఇళ్లు పగుళ్లు, బీటలు వారుతున్నాయని, స్లాబ్‌లు పెచ్చులూడుతున్నాయని, వెంటనే రిగ్‌బ్లాస్టింగ్‌లు నిలిపివేయాలని దుద్దుకూరు గ్రామానికి చెందిన నిమ్మగడ్డ హరిప్రసాద్, వల్లబని పుల్లారావు సహా స్థానికులు డిమాండ్ చేశారు. మంగళవారం గ్రామస్థులు రిగ్ బ్లాస్టింగ్, క్రషర్ల వల్ల తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నామని, వాటిని పూర్తిగా అరికట్టాలని డిమాండ్ చేస్తూ రహదారిపై నిరసన తెలిపి రాస్తారోకో చేపట్టారు. ఈ సందర్భంగా హరిప్రసాద్, పుల్లారావు మాట్లాడుతూ దుద్దుకూరులో సమీపంలో 20క్రషర్లు, 6క్వారీలు ఉన్నాయని, వీటి వల్ల నిత్యం ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారని వాపోయారు. క్వారీలో రాళ్లు తియ్యడానికి భారీ రిగ్గింగ్ బ్లాస్టింగ్‌లు జరుగుతున్నాయని, వాటి వల్ల భూమి కంపించి భవనాలు, బ్యారన్‌లు, గోడలు పగుళ్లు ఏర్పడటంతో పాటు స్లాబ్‌లు పెచ్చులు పెచ్చులుగా ఊడి రాత్రులు మీద పడుతున్నాయన్నారు. అలాగే వ్యవసాయ బోర్లు పూడుకుపోయి నీరు తోడడం లేదన్నారు. క్రషర్ల నుంచి వెలువడుతున్న దుమ్ముతో పిల్లలు, వృద్ధులు ఊపిరితిత్తుల వ్యాధులతో బాధపడుతున్నారని అన్నారు. అధికారులు వెంటనే క్వారీ యాజమానులు, నిబంధనలు పాటించని క్రషర్ యాజమానులపై చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో చాపర్ల వెంకట్రావు, గొర్లపని వెంకట్రావు, పెదవేగి సూర్యారావు, చినపర్తి నాగేంద్ర, కొడవలి సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ఇలా ఉంటే.. బడికెలా వెళ్లేది?

- దొండపూడి-రాజంపాలెం ప్రధాన రహదారిపై మురుగునీరు
- ఇబ్బందులు ఎదుర్కొంటున్న పాఠశాల విద్యార్థులు
- పిల్లలతో కలిసి కూటమి నాయకుల నిరసన



మురికినీటిలో నిలబడి నిరసన తెలుపుతున్న విద్యార్థులతో కూటమి నాయకులు

గోపాలపురం, జూలై 23: దొండపూడి, రాజంపాలెం గ్రామాల మధ్య ఎగువ ప్రాంతం నుంచి వస్తున్న మురుగునీరు ప్రధాన రహదారిపై ప్రవహిస్తున్నప్పటికీ అధికారులు పట్టించుకోవడంలేదని విద్యార్థులతో కలిసి కూటమి నాయకులు మురుగునీటిలో నిలబడి మంగళవారం నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా జనసేన నాయకుడు ఎస్కే హుస్సేన్ మాట్లాడుతూ దొండపూడి, రాజంపాలెం గ్రామాలను కలిపే ప్రధాన రహదారి పై మురుగునీటి ప్రవాహంలో రాజంపాలెం హైస్కూల్‌కు వందలాది మంది విద్యార్థులు మురుగునీటిలోనే నడుచుకుంటూ వెళ్లాల్సి వస్తోందన్నారు. దీంతో చిన్నపిల్లల పాదాలపై కురుపులు ఏర్పడి అనారోగ్యం బారిన పడుతున్నారన్నారు. ఈ మురుగునీరు ప్రవహించే ప్రాంతంలో గతంలో ఇద్దరు వ్యక్తులు డెంగీ బారిన పడి మృతి చెందారన్నారు. మురుగునీటి ప్రవాహానికి సంబంధించిన తూములను వైసీపీ నాయకుడు కూల్చేసి ఆ ప్రదేశంలో ఇంటిని నిర్మించుకున్నాడన్నారు. దీంతో మురుగునీరు కింద భాగంలో ఉన్న తూరల నుంచి వెళ్లేందుకు వీలు లేక రోడ్డు పైబడి ప్రవహిస్తోందన్నారు. నిత్యం ఆ రహదారిలో వందలాది మంది విద్యార్థులు రాజంపాలెం హైస్కూల్‌కు వెళ్తూ వస్తుంటారన్నారు. రహదారి భాగంలో అవసరమైన తూర్లను స్వచ్ఛందంగా ప్రజలే కొనుగోలు చేసి ఉంచినా అధికారులు బాధ్యతా రాహిత్యంగా వ్యవహరించారన్నారు. గతంలో పలుమార్లు అధికారులకు విన్నవించినప్పటికీ పట్టించుకోవడం లేదన్నారు. దీనిపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామన్నారు. కార్యక్రమంలో హైస్కూల్ విద్యార్థులు, పలువురు కూటమి నాయకులు పాల్గొన్నారు.

ఇక పోల‘వరమే’

- పోలవరం నిర్మాణానికి పూర్తి సహకారం
- కేంద్రం ప్రకటన.. నవంబరు నుంచి పనులు మొదలెట్టే అవకాశం






పోలవరం ప్రాజెక్టు, డయాఫ్రం వాల్

రాజమహేంద్రవరం (ఆంధ్రజ్యోతి)/రంపచోడవరం, జూలై 23: పోలవరం నిర్మాణానికి తమ పూర్తి సహకారం ఉంటుందని కేంద్రం ప్రకటించింది. దీంతో ఈ ప్రాజెక్టుకు మళ్లీ జీవం పోసినట్టయింది. 2019కి ముందు అప్పటి సీఎం చంద్రబాబు 72 శాతం మేర ప్రాజెక్టు పనులు పూర్తిచేసిన సంగతి తెలిసిందే. కానీ మొత్తం భూసేకరణ, పునరావాసం, కాలువలు అన్నీ కలుపుకుంటే కేవలం 49.79 శాతం అయినట్టే లెక్క. ఇక 2019లో జరిగిన ఎన్నికల్లో వైసీపీ అధికారంలోకి రావడంతో జగన్ ప్రభుత్వం ఈ ప్రాజెక్టును నిర్లక్ష్యం చేసింది. ఇటీవల జరిగిన ఎన్నికల్లో తెలుగుదేశం-జనసేన-బీజేపీ కూటమి ప్రభుత్వంరావడం, చంద్రబాబు మళ్లీ సీఎం కావడంతో ఈ ప్రాజెక్టుకు మళ్లీ దశ తిరిగింది. గతంలో మారిన అంచనాలను కూడా కేంద్రం అంగీకరించి, ప్రాజెక్టును పూర్తిచేయడానికి సహకరిస్తుందని కూటమి నేతలు చెబుతున్నారు. ప్రాజెక్టును 41.15 మీటర్ల ఎత్తువరకూ మొదటి దశలో నిర్మించడానికి గతంలో కేంద్ర కేబినెట్ ఆమోదించిన సంగతి తెలిసిందే. దాని ప్రకారం 30,436.95 కోట్ల అంచనా వేశారు. అందులో హెడ్‌వర్క్సు పనులకు రూ.14,023.2 కోట్లు, ఎడమ ప్రధాన కాలువ నిర్మాణానికి 1955.23 కోట్లు, కుడి ప్రధాన కాలువ నిర్మాణానికి 1812.45 కోట్లు, భూసేకరణకు 4853.22 కోట్లు ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీకి రూ.7417.19 కోట్లు, పీపీఏ చార్జిల కింద రూ.375.66 కోట్లు అవుతుందని అంచనా వేశారు. ఇది జాతీయ ప్రాజెక్టుగా ప్రకటించకముందే రూ.4730.71 కోట్లు ఖర్చయింది. గత ఏప్రిల్ నాటికి 25,706.24 కోట్లు బ్యాలెన్స్ ఉంది. జాతీయ ప్రాజెక్టుగా ప్రకటించిన తర్వాత 15,146.27 కోట్లు విడుదల చేశారు. ఫేజ్-2 కోసం ఖర్చు చేసింది రూ. 1597.56 కోట్లు. ఇంకా మిగిలింది రూ.12,157.53 కోట్లు. మరోవైపు 2019కి ముందే ఈ ప్రాజెక్టు నిర్మాణ వ్యయ అంచనాను రూ.54 వేల కోట్లకు పెంచి ప్రతిపాదించిన సంగతి తెలిసిందే. అప్పట్లో కేంద్రం కూడా అంగీకరించింది. కానీ వైసీపీ వైఖరి వల్ల దీనిపై కేంద్రం స్పష్టత ఇవ్వలేదు. ఇవాళ మళ్లీ దీనిపై కదలిక వచ్చే అవకాశం ఉంది. ప్రస్తుతం డయాఫ్రంవాల్ దెబ్బతినడం వల్ల దానికి రిపేర్లు చేయాలంటేనే రూ.447.90 కోట్లు అవసరం. ప్రత్యామ్నాయ డయాఫ్రంవాల్ నిర్మించాలంటే రూ.990 కోట్లు అవుతుంది. ప్రత్యామ్నాయ డయాఫ్రంవాల్ వైపే రాష్ట్రం మొగ్గు చూపుతున్నట్టు తెలుస్తోంది.

గోదావరికి వరద ఉధృతి

ధవళేశ్వరం వద్ద రెండో ప్రమాద హెచ్చరిక జారీ

14.60అడుగులకు చేరుకున్న నీటి మట్టం



కాటన్ బ్యారేజ్ వద్ద గోదావరి ఉధృతి

ధవళేశ్వరం, జూలై 23: ఎగువ ప్రాంతాల నుంచి పోటెత్తుతున్న వరద నీటితో ధవళేశ్వరం వద్ద గోదావరి నీటి మట్టం అంతకంతకు పెరుగుతుండడంతో సోమవారం రాత్రి 2గంటలకు రెండో ప్రమాద హెచ్చరికను జారీ చేశారు. ఆదివారం ఉదయం 7గంటలకు మొదటి ప్రమాద హెచ్చరిక జారీ కాగా 42గంటల వ్యవధిలో నీటి మట్టం 13.75అడుగులకు చేరుకుని 13లక్షల క్యూసెక్కులు నీరు తరలిరావడంతో రెండో ప్రమాద హెచ్చరిక జారీ అయింది. ఆపై నీటి మట్టం పెరుగుదల క్రమంగా నెమ్మదించి 3గంటలకు ఒక పాయింట్ చొప్పున పెరుగుతూ మంగళవారం రాత్రి 7గంటలకు 14.60అడుగులకు చేరుకుంది. ఈ సమయంలో కాటన్ బ్యారేజ్ నుంచి 14,10,928 క్యూసెక్కులు దిగువకు ప్రవహిస్తోంది. ఎగువన అన్ని ప్రాంతాల్లో నీటి మట్టం తగ్గుముఖం పట్టడంతో శుక్రవారం నాటికి ప్రమాదహెచ్చరికలు ఉపసంహరించే స్థాయికి నీటి మట్టం తగ్గవచ్చని అధికారులు అంచనా వేస్తున్నారు. ఎగువున భద్రాచలం వద్ద మంగళవారం ఉదయం 9గంటలకు 51.60 అడుగుల వరకు పెరిగిన నీటి మట్టం ఆపై తగ్గుతూ రాత్రి 7గంటలు 50.50 అడుగులకు చేరింది.

ఎగువ ప్రాంతాల్లో నీటి మట్టం తగ్గుముఖం

ఎగువన అన్ని ప్రాంతాల్లో గోదావరి నీటి మట్టం తగ్గుముఖం పట్టింది. కాళేశ్వరం వద్ద 12.39 మీటర్ల వరకు పెరిగిన నీటి మట్టం క్రమంగా తగ్గుతూ మంగళవారం సాయంత్రానికి 11.480మీటర్లకు చేరుకుంది. పేరూరు వద్ద 17.300 మీటర్ల నుంచి 16.290 మీటర్లకు, దుమ్ముగూడెం వద్ద 14.070 మీటర్ల నుంచి 13.710మీటర్లకు, భద్రాచలం వద్ద 51.60అడుగుల నుంచి 50.50అడుగులకు నీటి మట్టం తగ్గింది. కూనవరం వద్ద 21.450మీటర్లగా నీటి మట్టం నమోదు కాగా స్వల్పంగా పెరుగుతోంది. కుంట వద్ద 12.700మీటర్ల వరకు పెరిగిన నీటి మట్టం తగ్గుతూ 12.660మీటర్లకు చేరుకుంది. పోలవరం వద్ద 13.450 మీటర్లు, రాజమహేంద్రవరం రైల్వే బ్రిడ్జి వద్ద 16.920మీటర్లుగా నమోదు కాగా నీటి మట్టం పెరుగుతూ ఉంది.

జనసేన సభ్యత్వ నమోదు వేగవంతం చేయాలి

దేవర పల్లి, జూలై 23: జనసేన క్రియాశీలక సభ్యత్వ నమోదు వేగవంతం చేయాలని నియోజకవర్గ ఇన్‌చార్జి సువర్ణరాజు అన్నారు. మండలంలోని యర్నగూడెం బస్టాండ్ వద్ద జనసేన క్రియాశీలక సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని మంగళవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతిఒక్కరూ సభ్యత్వం నమోదు చేసుకోవాలన్నారు. సభ్యత్వ నమోదు వల్ల ఎన్నో ఉపయోగాలున్నాయని అవగాహన కలిగించారు. ఒక్కొక్క జనసైనికుడు పది సభ్యత్వాలు నమోదు చేయించాలన్నారు. గత ఏడాది 4వేలు సభ్యత్వాలు తీసుకున్నామని, ఈ ఏడాది 10వేల వరకు నమోదు చేయాలన్నారు. కార్యక్రమంలో మండలాధ్యక్షుడు కాట్నం గణేష్, బళ్ళా రాము, కరుణాకర్, నరేంద్ర, పుట్టా సాయి, సత్యనారాయణ, అయ్యప్ప, సూరిబాబు, భరత్ పాల్గొన్నారు.

ముంపు నివారణ పనుల పరిశీలన

చాగల్లు, జులై 23: చాగల్లు-కొవ్వాడ కాలువ ముంపు నివారణ చర్యలను ఎంపీడీవో ఎస్.బుజ్జి పరిశీలించారు. కాలువ పరివాహక ప్రాంత గ్రామాలైన దారవరం, బ్రాహ్మణగూడెం, మార్కొండపాడు గ్రామాల పరిధిలో వర్షం నీరు నిల్వ ఉండి పంట పొలాలు నీట మునిగిన ప్రాంతాల్లో కాలువను, రోడ్లను ఆమె పరిశీలించారు. వరద నీరు బయటకు వెళ్లే విధంగా ప్రొక్లెయినర్ల సహాయంతో గుర్రపు డెక్క తొలగించడం, ఇతర అడ్డంకులు తొలగించడం వంటి పనులు నిర్వహించారు. కార్యక్రమలో మండల వ్యవయసాయ అధికారి కె.వేణుగోపాల్, ఎన్ఆర్ఈజీఎస్ ఏపీవో అన్నపూర్ణ, పలు పంచాయతీల కార్యదర్శులు పాల్గొన్నారు.